నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | శనివారం 21-11-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:94 | పేజీలు: 4 | వెల: రూ.1/-

యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

ట్రక్కును ఢీకొన్న జీపు: 14మంది దుర్మరణం

లక్నో,నవంబర్20(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ప్రయాగ్‌రాజ్-లక్నో రహదారిపై ట్రక్కును ఓ జీపు ఢీకొట్టడంతో 14 మంది మృతిచెందారు. మరణించిన వారిలో ఆరుగురు చిన్నారులు కూడా ఉన్నారు. ప్రయాగ్‌రాజ్-లక్నో హైవేపై వెళుతున్న ఓ జీపు ప్రతాప్‌గఢ్ సమీపంలో నిన్న అర్ధరాత్రి ట్రక్కును ఢీకొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న 14 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను దవాఖానకు తరలించారు.

ప్రతాప్‌గఢ్ రోడ్డు ప్రమాద ఘటనపై ఉత్తరప్రదేశ్ సీఎం యోగీ ఆదిత్యనాథ్ తీవ్ర దిగ్భ్రాంతి-రతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఉన్నతాధికారులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ప్రాంతీయ భాషల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు

ప్రధాని మోడీకి సిఎం కెసిఆర్ లేఖ
పివి స్మారక తపాలా బిళ్ల విడుదల చేయాలని రాష్ట్రపతికి లేఖ

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామక పరీక్షలను ప్రాంతీయ భాషల్లో నిర్వహించాలని సీఎం కెసిఆర్ ప్రధాని మోడీని కోరారు. ఈ మేరకు ప్రధాని మోదీ, రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌కు శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ వేర్వేరుగా లేఖలు రాశారు. భారత ప్రభుత్వం, ఆధీనంలో విభాగాలు, యూపీఎస్‌సీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డులు, ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్‌బీఐ, స్టాఫ్ సెలెక్షన్ వంటి విభాగాల్లో పరీక్షలు హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో నిర్వహిస్తున్నారన్నారు. దీంతో ఆంగ్ల మాధ్యమంలో చదవని, హిందీయేతర రాష్ట్రాల అభ్యర్థులు కేంద్ర నియామకాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. అన్ని రాష్ట్రాలకు చెందిన అభ్యర్థులకు సమాన అవకాశాలు ఇచ్చేలా ప్రాంతీయ భాషల్లోనూ నియామక పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

అలాగే రాష్ట్రపతికి రాసిన మరో లేఖలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు శత జయంతి ఉత్సవాలు రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని సీఎం కెసిఆర్ తెలిపారు. తెలంగాణకు చెందిన ఆయన వివిధ రంగాల్లో తన ప్రతిభను ప్రదర్శించారన్నారు. అనేక ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచారని, అలాగే శాస్త్ర సాంకేతిక, మానవ వనరుల విభాగంలోనూ తనదైన ప్రత్యేకను గుర్తింపును సొంతం చేసుకున్నారన్నారు. పీవీ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పీవీ స్మారక తలాపా స్టాంప్‌ను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని, కేంద్రం ప్రణాళికకు వెంటనే ఆమోదముద్ర వేయాలని కోరారు. అలాగే శీతాకాలం సందర్భంగా దక్షిణాది విడిది కోసం హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో స్టాంప్‌ను ఆవిష్కరించాలని కోరారు. ఈ మేరకు లేఖను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వశాఖకు కూడా లేఖను పంపారు.

మరో 25మంది టిఆర్ఎస్ జాబితా విడుదల

మేయర్ బొంతు భార్యకు టిక్కెట్ కేటాయింపు
అడిక్‌మెట్‌లో మళ్లీ హేమలతారెడ్డికే ఛాన్స్

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేయనున్న 25 మంది అభ్యర్థులతో కూడిన మూడో జాబితాను టీఆర్ఎస్ పార్టీ శుక్రవారం ప్రకటించింది. బుధవారం తొలి విడతలో 105 మంది తొలి జాబితాను విడుదల చేయగా.. గురువారం 20 మందితో కూడిన జాబితాను ప్రకటించింది. తాజాగా మూడో విడతలో 25 మంది అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. పార్టీ టికెట్ పొందిన పలువురు అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేశారు. ప్రచారంపై దృష్టి సారించారు. టీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గ్రేటర్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే

అడిక్‌మెట్ డివిజన్‌లో టీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. తమకే టికెట్ కేటాయించాలంటూ ఆశావాహులు ఆందోళన నిర్వహించారు.

మంత్రి శ్రీనివాస్ సమక్షంలోనే ఆశావాహులు గొడవకు దిగారు. మంత్రి శ్రీనివాస్ కాన్వాయ్ ముందు బైటాయించారు. చివరకు పాత అభ్యర్థి హేమలతారెడ్డిని ప్రకటించి మంత్రి శ్రీనివాస్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

1.వెంగళ్‌రావునగర్ - దేదీప్యారావు, 2. రహమత్‌నగర్ - సీఎన్‌రెడ్డి,3. నేరెడ్‌మెట్ - మీనా ఉపేందర్‌రెడ్డి

4. ఈస్ట్ ఆనంద్ బాగ్ - ప్రేమ్‌కుమార్,5. గౌతమ్‌నగర్ - మేకల సునీతా రాముయాదవ్,6. గోల్నాక - దాసరి లావణ్య,7. చందానగర్ - మంజూల రఘునాథరెడ్డి,8. హైదర్‌నగర్ - నార్నె శ్రీనివాసరావు,9. తార్నాక - మోతె శ్రీలత,10. మౌలాలి - ముంతాజ్ ఫాతిమా,11. ఏఎన్‌రావునగర్ - పావనిరెడ్డి,12. చర్లపల్లి - బొంతు శ్రీదేవియాదవ్,13. మీర్‌పేట హెచ్‌బీ కాలనీ - జెర్రిపోతుల ప్రభుదాస్,14. నాచారం - శాంతి సాయిజన్ శేఖర్

15. చిలుకానగర్ - బన్నాల ప్రవీణ్ గీతాముదిరాజ్,16. హబ్సీగూడ - భేతి స్వప్నారెడ్డి,17. ఉప్పల్ - అరటికాయల శాలినీ భాస్కర్ ముదిరాజ్,18. అత్తాపూర్ - మాధవి అమరేందర్‌రెడ్డి,19. కాచిగూడ - డాక్టర్ శిరీష యాదవ్,20. నల్లకుంట - గరికంటి శ్రీదేవి,21. అంబర్‌పేట - విజయ్‌కుమార్ గౌడ్,22. ముషీరాబాద్ - ఎడ్ల భాగ్యలక్ష్మీ యాదవ్,23. కవాడిగూడ - లాస్య నందిత,24. యూసుఫ్‌గూడ - రాజ్‌కుమార్ పటేల్

25. అడిక్‌మెట్ - హేమలతారెడ్డి

పేర్లను ప్రకటించారు.

టీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యం

హైదరాబాద్ , నవంబర్ 20: టీఆర్ఎస్ గెలుపుతోనే ఆర్కేపురం అభివృద్ధి సాధ్యమని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మైనార్టీ, క్రిస్టియన్లు మంత్రి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేసే వ్యక్తిని గెలపించుకుంటే డివిజన్‌లో అభివృద్ధి జరుగుతుందన్నారు.సీఎం కేసీఆర్ రూ.65వేల కోట్లతో నగరాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. అధికారంలో ఉన్న టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే నగరాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. అలా కాకుండా ప్రతి పక్షాల అభ్యర్థులను గెలిపించుకుంటే అభివృద్ధి పూర్తిగా కుంటుబడుతుందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు టీఆర్ఎస్ వైపే చూస్తున్నారని తెలిపారు.

చరిత్రలో నేటినిజం

॥ జ్ఞానమ్మును, ధ్యానమ్మును
ప్రాణమ్మును మాతృదేశ భావచయములో
మానసమున నిలుపుకొనిన
"ఆనందిబెన్పటేల్"నభినందింతున్!!

(నవంబర్ 21 ఆనందీబెన్ పటేలు జననం..) -రాధశ్రీ

సెల్: 9494481210

కరోనాతో మరో నలుగురు మృతి

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్రంలో గురువారం రాత్రి 8గంటల వరకు 39,448 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా 894 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం ఇప్పటి వరకు నమోదైన కేసుల సంఖ్య 2,61,728కి చేరింది. ఈమేరకు వైద్య ఆరోగ్యశాఖ శుక్రవారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. గురువారం ఒక్కరోజే కరోనాతో నలుగురు మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 1,423కి చేరింది. కరోనాబారి నుంచి నిన్న 1,057 మంది కోలుకున్నారు. దీంతో ఇప్పటివరకు కోలుకున్న బాధితుల సంఖ్య 2,47,790కి చేరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 12,515 యాక్టివ్ కేసులు ఉన్నాయని, వారిలో 10,245 మంది హోం ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటి వరకు తెలంగాణలో నిర్వహించిన కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్య 50,50,612కి చేరింది.

బండి సంజయ్ నోట అన్నీ అబద్ధాలే

వరదసాయం అడ్డుకోవడానికే లేఖ ఇచ్చారు
బాధితులకు కేంద్రం పైసా విదిల్చలేదు
మండిపడ్డ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి
బండిని పట్టించుకోవాల్సిన పనిలేదన్న మంత్రి జగదీశ్వర్ రెడ్డి

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): బండి సంజయ్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తీవ్రంగా హెచ్చరించారు. అసత్యాలు మాట్లాడుతున్న బండి సంజయ్ దేశ ద్రోహి అని విమర్శించారు. ఇసికి రాసిన లేఖ ముమ్మాటికీ బండి సంజయ్‌దేనని అన్నారు. వరద సాయంను అడ్డుకున్నారని... పేదల పొట్టకొట్టారని మండిపడ్డారు. బీజేపీ ఎన్నికల సంఘంకి లేఖ ఇచ్చింది వాస్తవమని స్పష్టం చేశారు. వరద సాయం రూ.25 వేలు ఎక్కడి నుంచి ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఇస్తున్నారా? అని ఆయన నిలదీశారు. గ్రేటర్ ఎన్నికల తర్వాత అర్హులకు రూ.10 వేల సాయం ఈ ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. కేంద్రం తీసుకువచ్చిన మోటార్ వెహికిల్ చట్టంను బండి సంజయ్ వ్యతిరేకిస్తారా? అని ప్రశ్నించారు. బండి సంజయ్‌కి బుద్ధి...జ్ఞానం ఉందా? అని ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి విరుచుకుపడ్డారు. బండి సంజయ్ దేశ ద్రోహి అని.. చట్టాలను ఉల్లంఘిస్తున్నా డన్నారు. బండి సంజయ్ సవాల్ విసరాలనుకుంటే చార్మినార్ టెంపులే దొరికిందా.. వేరే గుడులు లేవా అని ప్రశ్నించారు. గెలిస్తే ఇంటికి రూ. 25 వేలు ఇస్తామంటున్న బీజేపీ నేతలు వరదలు వచ్చినప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. వరద సాయం ఆపాలని బీజేపీ నేతలు ఎన్నికల సంఘానికి, లెటర్ ఇచ్చింది వాస్తవమన్నారు. బీజేపీ కేంద్రం నుంచి రూపాయి కూడా తేలేదన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే కేంద్రం నుంచి నిధులు తేవాలన్నారు. బీజేపీ నేతలు మాట్లాడే తీరు వారి సంస్కృతికి అద్దం పడుతుందన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బిసిలకు 75,ఎస్సీ13,ఎస్టీలకు 3 సీట్లు ఇచ్చామన్నారు. కొన్ని జనరల్ సీట్లను కూడా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చామన్నారు. ఇదిలావుంటే తిట్లతోనే బీజేపీ ఓట్లు పొందాలనుకుంటోందని మంత్రి జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. గుడి పేరిట అబద్దాలు మాట్లాడటం బీజేపీకి మొదటి నుంచి అలవాటయ్యిం దన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ అబద్ధం అయితే వరద సాయం కొనసాగించాలని మరో లేఖ రాయాల్సిందన్నారు. బండి సంజయ్‌ను పట్టించు కోవాల్సిన అవసరం లేదని జగదీశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. తనకు తాను పెద్దగా ఊహించుకుంటున్నాడన్నారు. ఇప్పుడు చర్చ జరగాల్సింది అభివృద్ధి మీద అని పేర్కొన్నారు. అసదుద్దీన్ ప్రధాన మంత్రిని కూడా కలిశారని.. ప్రధాని అసదుద్దీన్‌తో ఎందుకు సమావేశం అయ్యారో సంజయ్ ముందు సమాధానం చెప్పాలని జగదీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయండి: పువ్వాడ పిలుపు

హైదరాబాద్,నవంబర్20 (ఆర్ఎన్ఎ):గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపు నిచ్చారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు శుక్రవారం టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. మరోసారి హైదరాబాద్ గులాబీ ఎంజెడా ఎగుర వేయనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఇదిలావుంటే మాధవరం తీరుపై టిఆర్ఎస్ కార్యకర్తలు మండిపడ్డారు. ఉద్యమంలో పాల్గొన్న తమకు టిక్కెట్ రాకుండా చేశారని పలువురు నిరసనలకు దిగారు.

ముంబైలో31 వరకు స్కూళ్ల మూసివేత

ముంబై,నవంబర్20(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర రాజధాని ముంబైలో డిసెంబర్ 31వ తేదీ వరకు స్కూళ్లను మూసివేయనున్నారు. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నడిచే పాఠశాలలను డిసెంబర్ 31 వరకు మూసివేస్తున్నట్లు ముంబై మేయర్ కిశోరి పడ్నేకర్ తెలిపారు. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో స్కూళ్లను తెరవడం లేదన్నారు. వాస్తవానికి సోమవారం నుంచి ముంబైలో స్కూళ్లను తిరిగి ఓపెన్ చేయాల్సి ఉన్నది. అయితే బీఎంసీ పరిధిలో ఉండే స్కూళ్లకు మాత్రం ఆంక్షలను పెంచేశారు. తాజాగా ముంబైలో కరోనా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ముంబై మేయర్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ముందుగా అనుకున్నట్లు నవంబర్ 23వ తేదీన స్కూళ్లను తెరవడం లేదని మేయర్ ఇవాళ తెలిపారు.

వచ్చే ఎప్రిల్ నాటికి కరోనా వ్యాక్సిన్

సీరం ఇన్‌స్టిట్యూట్ కీలక ప్రకటన
ముందే అందిస్తామన్న ఫైజర్ కంపెనీ

న్యూఢిల్లీ,నవంబర్20(ఆర్ఎన్ఎ): కరోనా వ్యాక్సిన్ లభ్యత, ధరపై దేశమంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్న తరుణంలో సీరం ఇన్స్‌స్టిట్యూట్ కీలక విషయాన్ని ప్రకటించింది. 2021 ఏప్రిల్ నుంచి సాధారణ ప్రజలకు కరోనా వ్యాక్సిన్ అందుబాటులోకి తీసుకొస్తామని సీరం సీఈఓ అదర్ పూనావాలా ప్రకటించారు. తాము ఉత్పత్తి చేస్తున్న కోవిడ్-19 వ్యాక్సిన్ ధర రూ.1000 వరకు ఉంటుందని తెలిపారు. రెండు డోసుల తమ వ్యాక్సిన్‌ను 5నుంచి 6 డాలర్ల చొప్పున అంటే సుమారు వెయ్యి రూపాయలకు అందిస్తామన్నారు.

ఫలితాలు, నియంత్రణ ఆమోదాలను బట్టి 2021 ఫిబ్రవరి లోపు హెల్త్ కేర్ సిబ్బందికి, వృద్ధులకు కరోనా వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే ఏప్రిల్ నాటికి సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండనుందని పూనావాలా తెలిపారు. ఫిబ్రవరి నుంచి నెలకు సుమారు 10 కోట్ల మోతాదులను తయారు చేయాలని ఎస్ఐఐ యోచిస్తోందని ఆయన చెప్పారు. 2024 నాటికి దేశంలోని అందరికి కరోనా వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందన్నారు. ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయం ఇండియాలోని సీరం ఇన్స్టిట్యూట్‌తో కలిసి కరోనా వ్యాక్సిన్‌ను రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు దేశీయంగా భారత్ బయోటెక్ రూపొందిస్తున్న కోవాగ్సిన్ మూడవ దశ ప్రయోగాలు ప్రారంభం అయ్యాయి. మరోవైపు కరోనా వ్యాక్సిన్‌కు సంబంధించి ఇప్పటికే భారీ ఊరటనిచ్చిన వ్యాక్సిన్ తయారీదారులు మరో శుభవార్త అందించారు. అన్ని సవ్యంగా జరిగితే మరి కొన్నిరోజుల్లోనే కోవిడ్-19 వ్యాక్సిన్ డెలివరీ షురూ కానుంది. ఈ మేరకు బయోఎన్‌టెక్ సీఈవ్ ఉగుర్ సాహిన్ రాయిటర్స్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకటించారు. ఈ ఏడాది క్రిస్మస్ కంటే ముందే ఫైజర్ అభివృద్ధి చేసిన కరోనావైరస్ వ్యాక్సిన్ డెలివరీ మొదలు పెట్టనున్నామని భావిస్తున్నామన్నారు. తమ కరోనా టీకా 95 శాతం సమర్థవంతంగా పనిచేస్తున్నట్టు అమెరికా కంపెనీ ఫైజర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగుర్ సాహిన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. యూరోప్‌లో ఈ వ్యాక్సిన్‌కు డిసెంబరులో టీకా అత్యవసర వినియోగం ఆమోదం, డిసెంబర్ రెండవ భాగంలో షరతులతో కూడిన అనుమతి లభించే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అన్నీ సానుకూలంగా జరిగితేనే డిసెంబర్ మధ్యలో టీకాకు అనుమతి లభిస్తుందని, క్రిస్మస్ పండుగ లోపే డెలివరీలు ప్రారంభం అవుతాయని ఆశిస్తున్నామన్నారు. జర్మనీ సంస్థ బయోఎన్‌టెక్‌తో కలిసి తయారు చేసిన తమ రెండు డోసుల టీకా మూడో దశ క్లినికల్ ట్రయల్స్‌లో అన్ని ప్రాథమిక ప్రమాణాల్లో విజయం సాధించిందని ప్రకటించేందుకు గర్వంగా ఉందని తెలిపింది. 65 ఏళ్లు పైబడిన పెద్దలలో కూడా తమ టీకా సామర్థ్యం 94శాతం కంటే ఎక్కువేనని తుది ప్రయోగ ఫలితాల్లో తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రకాల జాతుల, భిన్న వయస్కులపై వ్యాక్సిన్‌ను ప్రయోగించి చూశామని తెలిపింది.

భాగ్యలక్ష్మి ఆలయంలో బండి సంజయ్ పూజలు

ఎంపికి స్వాగతం పలికి పూజలు చేయించిన ట్రస్టీ
ఇసికి లేఖ రాయలేదని పునరుద్ఘాటించిన బండి
సర్వేలన్నీ బిజెపికి అనుకూలమని వెల్లడి
మేయర్ పీఠం అప్పగిస్తే వరదబాధితులకు 25 వేల సాయం ప్రకటన
బండి రాకతో భారీగా మోహరించిన పోలీసులు

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ మేయర్ పీఠాన్ని బీజేపీకి ఇస్తే వరద బాధితులకు 25వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. చార్మినార్ దగ్గర భాగ్యలక్ష్మి అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన... మీడియాతో మాట్లాడుతూ.. పాతబస్తీని భాగ్యనగరంగా మార్చుతామని, గ్రేటర్‌లో సర్వేలన్నీ బీజేపీకి అనుకూలంగా ఉన్నాయన్నారు. కేసీఆర్ సెంటిమెంట్‌ను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. వరద బాధితులకు సాయాన్ని నిలిపివేయించామని, తనపై చేసిన ఆరోపణలు బాధ కల్గించాయన్నారు. తన సంతకాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ ఫోర్జరీ చేయించారని, బీజేపీపై తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. ఎంఐఎం సహకారంతో గెలవాలని కేసీఆర్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. వరద నష్టాన్ని అంచనా వేసి.. బాధిత కుటుంబాలకు న్యాయం చేస్తామన్నారు. ఒక వర్గం ఓట్లు కోసమే కేసీఆర్ మత రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. తన సవాల్‌ను స్వీకరించి భాగ్యలక్ష్మీ ఆలయానికి సీఎం వస్తారని అనుకున్నానన్నారు. ప్రజలకు వాస్తవ విషయాలు తెలియాలనే భాగ్యలక్ష్మీ అమ్మవారి దేవాలయానికి వచ్చానన్నారు. తమ ఒత్తిడి కారణంగానే వరద భాధితులకు ప్రభుత్వం పది వేలు సాయం చేస్తోందన్నారు. కేంద్రం నిధులతోనే హైదరాబాద్‌లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ళపై భాగ్యనగర ప్రజలను కేసీఆర్ వంచించారన్నారు. కేసీఆర్ దగాకోరు మాటలు నమ్మొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇకపోతే చెప్పిన సమయానికి చార్మినార్ భాగ్యలక్ష్మీ ఆలయానికి ఆయన వచ్చారు. పార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్న బండి సంజయ్.. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంజయ్ వెంట బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంచందర్ రావు, అధికార ప్రతినిధి రాకేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలకు ఆలయ ట్రస్టీ శశికళా ఆహ్వానం పలికారు. రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్‌కు ఆలయ పూజారులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆ తర్వాత ఆలయం చుట్టు పద్రక్షణలు చేశారు. బండి సంజయ్ చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయానికి రాకతో ఉదయం కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వరద సాయంపై సంజయ్ సవాల్‌తో హైదరాబాద్ పోలీసులు అలర్ట్ అయ్యారు. బీజేపీ స్టేట్ ఆఫీస్ తో పాటు చార్మినార్ పరిసర ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వరద సాయం లేఖపై సవాల్ విసిరిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం మధ్యాహ్నం చార్మినార్ వద్ద భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయానికి చేరుకుని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో చార్మినార్ దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. అసలే శుక్రవారం కావడంతో చార్మినార్ వద్ద పరిస్థితి హీటెక్కింది. మరోవైపు బీజేపీ కార్యాలయం దగ్గర పోలీసులు భారీగా మోహరించారు. వరద సాయం నిలిపివేయాలంటూ తాను ఈసీకి లేఖ రాయలేదని బండి సంజయ్ స్పష్టం చేశారు. లేఖపై నిజానిజాలు తేల్చుకునేందుకు సీఎం కేసీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు. తన సంతకాన్ని ఫోర్జరీ చేశారని అన్నారు. ఫోర్జరీ చేసిన లేఖను పట్టుకుని ముఖ్యమంత్రి ఆరోపణలు చేయడంపై మండిపడ్డారు.

తమను దొంగదెబ్బ తీయడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆడిన నాటకంలో భాగమే ఈసీకి లేఖ అని ఎదురుదాడికి దిగారు. తన పేరు మీద సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న లేఖ తాను రాయలేదని, సీసీఎస్‌లో బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. నకిలీ లేఖపై నిజాలు తేల్చుకుందామంటూ సీఎం కేసీఆర్‌కు సంజయ్ సవాలు విసిరారు. చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్దకు రావాలంటూ సవాల్ చేశారు.

ర్యాలీగా భాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయం వద్దకు బండి సంజయ్ చేరుకోనున్నారన్న సమాచారంతో అప్రమత్తం అయ్యారు. అయితే ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ర్యాలీలను అనుమతించమని అన్నారు. అప్పటికే బీజేపి కార్యాలయానికి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుంటున్నారు. మరోవైపు సంజయ్ ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేవని మొదట చెప్పిన పోలీసులు.. ఆ తరువాత అనుమతిని ఇస్తున్నట్లు ప్రకటించారు. అయితే శుక్రవారం కావడంతో చార్మినార్ వీధుల్లో టెన్షన్ నెలకొంది. అప్పటికే బీజేపీ కార్యాలయం ముందు,చార్మినార్ వద్ద భారీగా పోలీసులు మోహరించారు. ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలు చోటుచేసుకోకుండార్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని సీపీ అంజనీకుమార్ హెచ్చరించారు.ఆయన పర్యటను వీడియోల రికార్డ్ చేస్తామని అన్నారు.

జీహెచ్ఎంసీ ఎన్నికలకు నగర పోలీసుల సమాయత్తం

ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు
జోన్ల వారీగా పోలీసు ఉన్నతాధికారులకు బాధ్యతలు

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): జీహెచ్ఎంసీ ఎన్నికలకు నగర పోలీసులు సమాయత్తమవుతున్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలీసుశాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేస్తున్నది. ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా నగరంలోని జోన్ల వారీగా పోలీసు ఉన్నతాధికారులకు సీపీ అంజనీకుమార్ బాధ్యతలు అప్పగించారు.

తూర్పు మండలం ఇన్‌చార్జిగా షికా గోయల్, పశ్చిమ మండల ఇన్‌చార్జిగా అనిల్ కుమార్, సౌత్ జోన్ ఇన్‌చార్జిగా డీఎస్ చౌహాన్, మధ్య మండల ఇన్‌చార్జిగా తరుణ్ జోషి, తూర్పు మండలం ఇన్‌చార్జిగా అవినాశ్ మహంతిని నియమించారు. అధికారులు తమ పరిధిలోని పోలింగ్, లెక్కింపు కేంద్రాలు, స్ట్రాం÷-రగ్ రూంలను తనిఖీ చేయనున్నారు. ఎన్నికల సందర్భంగా ఎలా వ్యవహరించాలనే విషయాలపై డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు.ఎన్నికల నేపథ్యంలో అలజడి సృష్టించి మత ఘర్షణలకు పాల్పడే పాత నేరస్థులు, రౌడీషీటర్లపై పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఎన్నికలు జరుగుతున్న 38

నేటినిజం
శనివారం 21-11-2020

ప్రజాసమస్యలు పక్కకు..విమర్శలు ముందుకు !

ఎన్నిక ఏదైనా ప్రజా సమస్యలు పక్కకు పోయి పరస్పర విమర్శలు తెరపైకి వస్తాయి. ఇలా రావాలన్నది కూడా రాజకీయ పార్టీల ఆభిలాష. విమర్శలతో ఎదుటివారిని బురిడీ కొట్టించే ప్రక్రియ అవసరం. కొందరు ప్రజలు కూడా ఈ విమర్శల ఆధారంగా ప్రభావితం అవుతారు. అందుకే రకరకాలుగా విమర్శలకు పదను పెడతారు. ఈ విమర్శల సుడిలో అసలు సమస్యలు పక్కకు పోతాయి. ఇదే ఎత్తుగడలను ప్రతి ఎన్నికల్లోనూ రాజకీయ పార్టీలు అవలంబిస్తుంటాయి. ఇందుకు బిజెపి, కాంగ్రెస్, టిఆర్ఎస్, లెఫ్ట్ పార్టీలు మినహాయింపు కాదు. ఎవరికి వారు తమ కోణంలో విమర్శలు చేస్తూ ఎదుటి వారిని పక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తుంటారు. గ్రేటర్ ఎన్నికల్లోనూ అదే జరుగుతోంది. వరదసాయంపై అధికార పార్టీ ఓ రకంగా..బిజెపి మరో రకంగా స్పందించింది. పరస్పర విమర్శలు, సవాళ్లు విసురుకుంటున్నారు. వరద సాయం ఆపడానికి బిజెపి,కాంగ్రెస్ పార్టీల కుట్రే కారణమంటూ టిఆర్ఎస్ ప్రచార ఉధృతిని పెంచింది. వారు లేఖలు రాయడం వల్లనే ఎన్నికల సంఘం సాయాన్ని నిలిపివేసిందని టిఆర్ఎస్ అధినేత,సిఎం కెసిఆర్ చేసిన విమర్శలకు అనుగుణంగా ఇప్పుడు టిఆర్ఎస్ శ్రేణులు ప్రచారంలో దూసుకుని పోతున్నాయి. దీనికి కౌంటర్‌గా బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. వరదసాయం చేయాల్సి వస్తే ఇంతకాలం ఎందుకు ఆగారని, ఎందుకు ఎన్నికలకు తొందరపడ్డారని.. లేఖ తనదే అయితే చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయం వద్ద ప్రమాణానికి సిఎం కెసిఆర్ రావాల ంటూ సవాల్ చేశారు. ఇక కాంగ్రెస్ ఆరోపణలు అందుకు భిన్నంగా ఏమీ లేవు. అధికార పార్టీ తీరును ఎండగడు తూనే..టిఆర్ఎస్, బిజెపి, ఎఐఎంలు కుట్రదారులని, కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఒక్కటయ్యాయని విమర్శలు ఎక్కుపెట్టారు. మొత్తంగా సమయం తక్కువగా ఉండడంతో గ్రేటర్ ఎన్నికల ప్రచారం తొలిరోజు నుంచే వేడెక్కింది. పరస్పర విమర్శల తీవ్రత మరింత పెరగనుంది. మొత్తంగా గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు ఆసక్తిగా మారబోతున్నాయి. టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పోటీ ఒక ఎత్తు అయితే.. టీడీపీ, జనసేన సైతం బరిలో దిగుతున్నాయి. వైసీపీ మాత్రం ఎన్నికలకు దూరం అటూ ప్రకటన చేసింది. కాకపోతే పోటీలో ఉన్న మూడు ప్రధాన పార్టీల వల్ల ఎవరికి లాభం.. ఎవరికి నష్టం అన్న చర్చ ఊపందుకుంది. వీరు ఏ మేరకు సాయం అందిస్తారన్నది కూడా ముఖ్యమే. ఈ క్రమంలో సమస్యల కన్నా ప్రజలను ఆకట్టుకునే యత్నాలు ప్రధానంగా ముందుకు వస్తున్నాయి. 150 డివిజన్లు.. అరడజనకు పైగా పార్టీలు. అదృష్టం పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యాయి. రెండు తెలుగు రాష్ట్రాలకు హైదరాబాద్ కీలకం కావడంతో ఎపిలో ఉన్నవారు సైతం ఎన్నికలను ప్రభావితం చేసేవిగా ఉన్నాయి. ఇక్కడ సెటిలర్లు ఉన్నారు. వారు ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నారు. అనేక డివిజన్లలో వారి ప్రభావం తప్పకుండా ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టిడిపి ఉబలాటపడుతోంది. అయితే ఇప్పుడున్న పరిస్థితుల్లో టిడిపికి అంత సీన్ ఉండకపోవచ్చు. అన్ని డివిజన్లలో సింగిల్‌గా పోటీ చేస్తామని టీడీపీ ఇప్పటికే ప్రకటించింది. 9ఏళ్లపాటు పాలన చేసిన మాజీ సిఎం చంద్రబాబు కూడా ప్రత్యేక దృష్టి పెట్టారని అంటున్నారు. 2016 ఎన్నికల్లో టీడీపీకి ఒక్క కార్పొరేటరే గెలిచారు. ఇప్పుడు ఆ ఒక్కటైనా నిలబెట్టుకుంటారా లేక ఏ మేరకు ఎవరి ఓట్లు చీల్చుతారన్నది ఆసక్తిగా మారింది. ఇదే సమయంలో ఎన్నికలకు జనసేన సమాయత్తం అవుతోంది. పార్టీ నాయకులతో జనసేనాని పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. కష్టపడేవారికి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. 150 డివిజన్లలో దాదాపు 40 డివిజన్లలో పోటీ చేయాలనే ఆసక్తితో జనసేన ఉన్నట్లు ప్రకటించారు. బిఎపితో పొత్తుపై చర్చిస్తారని కూడా తెలుస్తోంది. ఈ చర్చలో ఎలాంటి సంకేతాలు ఉంటాయన్నది ఇంకా తెలియాల్సి ఉంది. గ్రేటర్‌లోని కొన్ని ప్రాంతాల్లో జనసేనకు బలమైన కేడర్ ఉందని.. తప్పకుండా మంచి ఫలితాలు వస్తాయని వారు ఆశిస్తున్నారు. ఏపీలో బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకున్నా, తెలంగాణలో ఆ మేరకు పొత్తు లేదు. గ్రేటర్ ఎన్నికల్లో జనసేన, బీజేపీ వేర్వేరుగా పోటీ చేస్తాయా లేక పొత్తు పెట్టుకుంటాయా అన్నది తేలాల్సి ఉంది. నామినేషన్ల దాఖలు శుక్రవారంతో ముగియనుంది. ప్రచారానికి కానీ పెద్దగా సమయం లేదు. ఇకపోతే ఏ ఎన్నిక అయినా చేరికలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ఈ పార్టీ నుంచి ఆ పార్టీకి..ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి చేరికలతో ఎదుటి పార్టీని దెబ్బతీసే వ్యూహాలు కూడా సర్వసాధారణంగా జరిగేవే. ఈ కారణంగా గ్రేటర్ ఎన్నికలే లక్ష్యంగా నేతలు పాచికలు వేస్తున్నారు. అధికార పక్షంతోపాటు ప్రతిపక్షాలైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గోడ దూకే వారిని ప్రోత్సహించేందుకు సర్వం సిద్ధం చేసుకుంటున్నాయి. వలసల వల్ల పార్టీకి బలం పెరిగి హైప్ వస్తుందని, ఓటర్ల దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంటుందని భావిస్తుంటారు. ఎన్నికల ముందు వలసలు రాజకీయ వేడిని పుట్టిస్తాయని, అన్నీ కలిసి వస్తే విజయం సాధించినా ఆశ్చర్యపోనవసరం లేదని చెబుతున్నారు. ఇలా పట్టు కోసం అన్నిపార్టీలు తమదైన శైలితో ఎత్తులు వేస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఒక్కరూ ఇక్కడ తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంటారు. ఇక్కడి ఓటర్లు విభిన్నంగా తీర్పునిస్తుంటారు. దీంతో అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులను టీఆర్ఎస్‌లోకి లాగేందుకు ఆ పార్టీ నాయకులు రంగంలోకి దిగారు. కొన్నిచోట్ల బీజేపీ టికెట్ కోసం పోటీ ఉంది. కానీ ఒక్కరికే అవకాశం దక్కుతుంది. టీఆర్ఎస్‌లోకి వస్తే నామినేటెడ్ పదవులు ఇస్తాం, వ్యాపారాల్లో సహకరిస్తామంటూ తెర వెనుక హామీలు గుప్పిస్తున్నారు. సిట్టింగ్‌లకు ఇతర పార్టీల ఆశావాహులు కలిస్తే విజయం నల్లేరు మీద నడకే అని పార్టీ భావిస్తోంది. ద్వితీయ శ్రేణి నాయకులనూ ఆకట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. కాంగ్రెస్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై విశ్లేషణ చేసుకుంటోంది. అవకాశం దొరికితే పైచేయిసాధించాలని భావిస్తోంది. ఈ క్రమంలో బీజేపీ, టీఆర్ఎస్ ఇతరులను తమవైపు తిప్పుకుంటున్నాయి. మిగతా పార్టీలు మాత్రం కండువా వేసుకోగానే కాదు ఓట్లు పడాలి కదా అంటూ కొట్టేస్తున్నాయి. గ్రేటర్ ఎన్నికల ముందు పార్టీల్లో చేరికలు సర్వసాధరణమని, దీంతో ఓటు బ్యాంకులో తేడాలు రావని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఏదేమైనా సమస్యలకన్నా వ్యూహాలకే పదను పెట్టడంలో రాజకీయ పార్టీలు ఆరి తేరాయి. అవే ప్రధానంగా తెరముందు కనిపిస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు విజ్ఞతగా ఆలోచించి ఓటు వేయాలి. ప్రతి ఒక్కరూ ఓటేసేందుకు ముందుకు రావాలి. అప్పుడే నగర సమస్యలపై పోరాడే అవకాశం దక్కుతుంది.

ప్రపంచ టాయ్‌లెట్ దినోత్సవం

సిద్దిపేట, పెద్దపల్లి జిల్లాలకు అవార్డులు

సిద్దిపేట,నవంబర్20(ఆర్ఎన్ఎ): ప్రపంచ టాయిలెట్ దినోత్సవ వేడుకలో భాగంగా మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన పెంపొందించడం, ద్రవ, ఘన పదార్థాల నిర్వహణ శ్రమదానాలు, స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్‌లో కనబర్చిన ప్రదర్శన ఆధారంగా దేశవ్యాప్తంగా 20 జిల్లాలను ఎంపిక చేసింది. అందులో సిద్దిపేట, పెద్దపల్లిలకు జాతీయ స్థాయిలో అవార్డులు దక్కాయి. అనేక అంశాల్లో తనదైన ప్రత్యేకత చాటుతూ అవార్డులు చేజిక్కించుకుంటున్న సిద్దిపేట,పెద్దపల్లి జిల్లాలకు ఈ ఖ్యాతి దక్కింది. ఇకపోతే సిద్దిపేట ఇలా ఈ అవార్డును సొంతం చేసుకుంది. సిద్దిపేటకు జిల్లా ఈ జాబితాలో చోటు దక్కించుకుంది. తెలంగాణ రాష్ట్రం నుంచి సిద్దిపేట జిల్లాతో పాటు పెద్దపల్లి జిల్లా అవార్డుకు ఎంపికైంది. కొవిడ్-19 నేపథ్యంలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం గురువారం ఢిల్లీ నుంచి ఆన్‌లైన్ వేదికగా నిర్వహించారు. కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, డీఆర్‌డీవో గోపాల్‌రావు, డీపీవో సురేశ్‌తో కలిసి సిద్దిపేట కలెక్టరేట్ నుంచి అవార్డు ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర జలశక్తిమంత్రి, రాష్ట్ర మంత్రుల ఆధ్వర్యంలో ప్రధానోత్సవ వేడుక జరిగింది. కేంద్ర జలశక్తిమంత్రి గజేంద్రసింగ్ షెకావత్, రాష్ట్ర మంత్రులు జాతీయస్థాయి స్వచ్ఛ అవార్డును సిద్దిపేట జిల్లా కలెక్టర్‌కు ఆన్‌లైన్ వేదికగా అందించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి కేంద్ర జలశక్తి మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో చేపట్టిన స్వచ్ఛత కార్యక్రమాలకు దేశవ్యాప్త గుర్తింపునివ్వడం సంతోషంగా ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు మార్గదర్శనం మేరకు జిల్లాలో స్వచ్ఛత అంశాలకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్‌లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అందరికంటే మెరుగ్గా అమలు చేస్తున్న పెద్దపల్లి జిల్లాకు కూడా ఈ జాతీయ అవార్డు లభించింది. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ నుంచి పెద్దపల్లి ఇన్‌చార్జి కలెక్టర్ భారతి హోళికేరి స్వీకరించారు. పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్మాణం, వినియోగంలో జిల్లా ముందుండడం వల్లే ఈ అవార్డు లభించిందని ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల సమష్టి పనితీరే అవార్డుకు ప్రధాన కారణమన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

కెసిఆర్ మంచి పాలనాదక్షుడు

ఆయనకు అండగా కల్చరల్ ఫ్రంట్ పెడతా: గద్దర్

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప ప్రజా నాయకులు, పాలనాదక్షులని ప్రజా గాయకుడు గద్దర్ అన్నారు. దేశ రాజకీయాల గతిని సమూలంగా మార్చాల్సిన అవసరం ఉందని, ఇందుకు గాను కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తే దానికి అనుబంధంగా కల్చరల్ ఫ్రంట్ పెట్టడం ద్వారా సంపూర్ణ మద్దతునిస్తానన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల ప్రచారం సందర్భంగా టీఆర్ఎస్ వెంకటాపురం డివిజన్ ఇంఛార్జిగా వ్యవహరిస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్ గురువారం గద్దర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రితో గద్దర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు కేసీఆర్ 14 రోజుల పాటు కఠోర దీక్ష చేసిన సందర్భాన్ని గుర్తు చేశారు. సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌తో ముందుకువస్తే దానికి అనుబంధంగా కల్చరల్ ఫ్రంట్ ఏర్పాటు చేసి ఆయనతో కలిసి ముందుకు సాగాలనేది తన అభిమతమన్నారు. కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలోని దాదాపు సగభాగం సస్యశ్యామలంగా మారిందన్నారు. రైతులు, ప్రజలు సంతోషిస్తున్నారని కొనియాడారు. టీఆర్ఎస్ కార్పోరేటర్‌గా వెంకటాపురం డివిజన్ నుంచి తిరిగి పోటీ చేస్తున్న సబితా కిశోర్‌ను గద్దర్ ఆశీర్వదించారు.

స్వల్పంగా తగ్గిన పసిడి ధరలు

న్యూఢిల్లీ,నవంబర్20(ఆర్ఎన్ఎ): దేశంలో పసిడి ధరలు మరింత తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో గురువారం 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.248 తగ్గి రూ.49,714కు చేరింది. గత ట్రేడ్‌లో 10 గ్రాముల పసిడి ధర రూ.49,962 వద్ద ముగిసింది. ఇక వెండి ధర కూడా గురువారం స్వల్పంగా పెరిగింది. ఢిల్లీలో కిలో వెండి ధర రూ.853 తగ్గి రూ.61,184కు చేరింది. గత ట్రేడ్‌లో కిలో వెండి ధర రూ.62,037 వద్ద ముగిసింది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ఇవాళ ఔన్స్ బంగారం ధర 1861 అమెరికన్ డాలర్లు, ఔన్స్ వెండి ధర 24.02 అమెరికన్ డాలర్‌లు పలికింది.

హైదరాబాద్ అభివృద్ధికే ప్రజలు ఓటేస్తారు

-రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు

సంగారెడ్డి,నవంబర్20(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో తమ ప్రచారాస్త్రాలని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. బీజేపీ మాత్రం ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. సంగారెడ్డి జిల్లా పఠాన్‌చెరులో టీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఎదాదికి కోటి చొప్పున ఉద్యోగాలిస్తామని చెప్పిన బీజేపీ ఈ ఆరున్నరేళ్లలే ఎన్ని కోట్ల ఉద్యోగాలు ఇచ్చిందో చెప్పాలన్నారు. ఇప్పుడు పెట్టుబడుల ఉపసంహరణతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరిస్తోం దన్నారు. దీంతో లక్షలాది మంది తమ ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. బీఎస్ఎన్ఎల్, రైల్వేలు, ఎయిర్ ఇండియా, బీపీసీఎల్, ఓఎన్జీసీ వంటి సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. ప్రతిష్టాత్మకమైన బీహెచ్ఈఎల్ మూతపడే పరిస్థితి వచ్చిందన్నారు. అదే టీఆర్ఎస్ ప్రభుత్వం మాత్రం బీహెచ్ఈఎల్‌కు రూ. 30 వేలకోట్ల విలువ గల యాదాద్రి పవర్ ప్రాజెక్టు పనులు అప్పగించినట్లు తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు కు సంబంధించి ఆసియాలోనే అతి పెద్ద 148 మెగావాట్ల పంపు పనులు అప్పగించిందన్నారు. కేంద్రం కాని, దేశంలో ఏ రాష్ట్రం కూడా బీహెచ్ఈఎల్‌కు పనులు అప్పగించలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి జీడీపీ వృద్ధి రేటు ఎనిమిది శాతం కన్నా ఎక్కువగా ఉంది. దాన్ని బీజేపీ మైనస్ ఇరవై నాలుగు శాతానికి తీసుకెళ్లిందన్నారు. దీని వల్ల దేశంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి ఇతర నేతలు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ మీడియంతో తెలుగుకు వచ్చే ప్రమాదమేమీ లేదు

పేదలవర్గాల సామాజిక అభివృద్ధికి భాష కూడా అవసరమే
భాషలపై పట్టు సాధిస్తేనే ప్రపంచంలో నెగ్గగలం

విజయవాడ,నవంబర్20(ఆర్ఎన్ఎ): కరోనాతో పాఠశాలలు తెరవక పోవడం, తెరిచినా కొద్దిమంది విద్యార్థులే హాజరు కావడంతో ఈ యేడాది విద్యాసంవత్సరం గందరగోళంలో పడింది. మరోవైపు ఇంగ్లీష్ మీడియం వ్యవహారం కూడా ఇంకా ఓ కొలిక్కి రాలేదు. దీనిపై అనేకులు కోర్టులకు వెళ్లినా, తల్లిదండ్రులుల కూడా ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం ఉండాలని కోరుకుంటున్నారు. ఇంగ్లీష్ మీడియం స్కూళ్లకు సామాన్య తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు. తమ పిల్లలను వారు ప్రైవేట్ రంగంలో ఉన్న ఇంగ్లీష్ మీడియం స్కూళ్లకు పంపడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. పేద తల్లిదండ్రులు కూడా తమ పిల్లలతో మమ్మీడాడీ అనిపించుకోవాలని తపనపడుతున్నారు. తమ పిల్లలు ఇంగ్లీషులో మాట్లాడితే ముచ్చట పడుతున్నారు. ఇది సామాజికంగా వచ్చిన మార్పుగా చూడాలి. దేశంలో నిరుద్యోగం తాండవిస్తున్న ప్రస్తుత తరుణంలో పిల్లలో తమకు తాముగా కెరీర్ చూసుకుని విదేశాల్లో స్థిరపడుతున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ దశలో ఇటీవల ఎపి రాష్ట్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరంలో ఒకటో తరగతి నుండి ఎనిమిదో తరగతి వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోను తెలుగు మీడియంను రద్దు చేసి ఇంగ్లీషు మీడియంలో నిర్వహిస్తామని జి.వో విడుదల చేసింది. ఈ విషయం మీద రాష్ట్రంలో తీవ్ర చర్చ ప్రారంభమైంది. కేవలం పెద్దవర్గాలకే పరిమితం అయిన ఇంగ్లీష్ మీడియం పేదలకు కూడా అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడు ప్రతి ఇంటి నుంచి ఒకరో ఇద్దరో విదేశాల్లో చదువుకుంటున్నారు.తెలుగును బోధనా భాషగా రద్దు చేయడం సరికాదని, తెలుగుతో పాటుగా ఇంగ్లీషు మాధ్యమాన్ని కూడా కొనసాగిస్తే సరిపోతుందని కొంతమంది అభిప్రాయ పడుతున్నారు. అయితే, వారిపై కొంతమంది కుల సంఘాల నాయకులు తీవ్రమైన దాడి చేస్తున్నారు. దళితులు ఇంగ్లీషు నేర్చుకోవడం ఇష్టం లేకనే ఇంగ్లీషులో బోధనను వ్యతిరేకిస్తునారని తీవ్రంగా విమర్శిస్తున్నారు. క్లాస్ రూముల్లో ఇంగ్లీష్‌తో పాటు మాతృభాష తెలుగును కూడా బోధిస్తే వచ్చే ప్రమాదం లేదు. మాతృభాషను మరవకుండా ఇంగ్లీష్ నేర్చుకోవాలన్న సంకల్పం బలపడాలి. మరింతగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర, రాష్ట్ర పాలకులు ఇతోధికంగా కృషి చేయాల్సింది. దేశంలో నేటికీ నూటికి దాదాపు యాభై మంది వ్యవసాయ కూలీలుగా, దళితులుగా జీవనం సాగిస్తున్నారు. కష్టపడ దామన్నా, పని దొరకక కడుపు నిండా తిండి లేక పిల్లలకు సరైన పోషకాహారం పెట్టలేని స్థితిలో బిడ్డల చదువుకి ఎంత ప్రాధాన్యత ఇస్తున్నారు. గ్రామాల్లోని అట్టడుగున ఉన్న దళితులు ఎంతగా వెనుకబడి వున్నారు. వీరికి విద్యతో పాటు ఉన్నత ఉద్యోగాలు అవసరమే. వీరు తమ బిడ్డలకు ఉన్నత చదువులకి ఇంగ్లీషు అవసరం కాబట్టి ఇంగ్లీషు కావాలని కోరుతున్నారు. అభివృద్ధిలో అందరూ అమెరికాను చూస్తుంటారు. అదే విధంగా మన తెలుగు భాషను కూడా అభివృద్ధి చేయడానికి పూనుకోవాలి. ఏదీ స్థిరంగా ఉండదు. నిరంతరం మార్పుకు లోనౌతూ అభివృద్ధి వైపే ప్రయాణి స్తుంది. ఇందుకు భాష మినహాయింపు కాదు. అందువల్ల ఆంగ్లంతో పాటు హిందీ, తెలుగు భాషలను కూడా నేర్చుకోవాల్సిందే. అభివృద్ధి చెందిన ఏ దేశమైనా వారి దేశ భాషతోనే అభివృద్ధి చెందింది తప్ప ఇంగ్లీషు భాష ద్వారా మాత్రం కాదు. అయితే ప్రపంచం ఇప్పుడు ఇంగ్లీష్ లేకుండా ముందుకు సాగడం లేదు. అందుకే చైనా, జపాన్,రష్యా, జర్మన్ లాంటి దేశాల ప్రజలు కూడా ఇప్పుడు ఆంగ్లంపై పట్టు సాధించే పనిలో పడ్డాయి. అక్కడి విద్యార్థులు తమ భాషతో పాటు ఆంగ్లం కోసం కసరత్తు చేస్తున్నాయి. చైనా మాతృభాష లోనే అభివృద్ధి సాధిస్తోంది తప్ప ఇంగ్లీషు ద్వారా మాత్రం కాదు. జర్మనీ, జపాన్ దేశాలు అభివృద్ధిలో మూడు, నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇదంతా మాతృభాష ద్వారానే సాధించాయి. అయితే అవి ఇంగ్లీష్ నేర్చుకోఏక పోవడం కారణంగా వెనకబడ్డామని గుర్తించాయి. అందుకే ఇప్పుడా దేశాల్లో ఇంగ్లీష్ కోసం క్యూ కడుతున్నారు. ఇంగ్లీషు లేకపోతే అభివృద్ధి ఆగిపోదనే వారు ఉన్నారు. జర్మనీ, జపాన్, ఫ్రాన్స్ దేశాలు ఎందుకు అభివృద్ధి చెందినట్లని అనేవారూ ఉన్నారు. అభివృద్ధికి , భాషకు ముడి పెట్టడం సరికాదనే వారు ఉన్నారు. అయినా భాషను కమ్యూనికేషన్ కోసం మాత్రం నేర్చుకోవడంలో తప్పులేదు. శాస్త్ర విజ్ఞానం వల్ల కంప్యూటర్ రంగం ఎంతో అభివృద్ధి సాధిస్తున్నది. ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్‌లు వచ్చిన తరువాత శాస్త్ర సాంకేతిక అభివృద్ధి మన ముంగిట్లోకి వచ్చింది. ప్రపంచం అంతా ఒక కుగ్రామంగా మారి సమాచారం మొత్తం అందుబాటులోకి వచ్చింది. గూగుల్, యూట్యూబ్, వాట్సప్, ఫేస్‌బుక్, ట్విటర్ లాంటివి అందుబాటు లోకి వచ్చిన తరువాత క్షణాల్లో కోరిన సమాచారం మన ముందుకు వస్తున్నది. ఇంగ్లీష్ మాత్రమే కాక మన దేశ భాషలలో అనేక భాషలు ఇంటర్నెట్ ద్వారా తెలుగు ఫాంట్‌ను రూపొందించాయి. అయినా ఎక్కడో వెలితి కనిపిస్తూనే ఉంది. ఇంగ్లీష్‌లో కమ్యూనికేట్ చేసినంతగా మాతృభాషలో చేయలేకపోతున్నాం. తెలుగునే మడికట్టుకుని నేర్చుకుంటే ఫారిన్ వెళ్లే విద్యార్థుల గతేం కాను.

స్వచ్ఛతకు తూట్లు పొడుస్తున్న ప్రజలు

వ్యర్థాలను ఇష్టారీతిన రోడ్డుపై పడేస్తున్నారు
వాడిపడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలతో అనర్థాలు

హైదరాబాద్,నవంబరు20 (ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్‌లో స్వచ్ఛతకు ఎన్ని చర్యలు తీసుకున్న ప్రజల సహకారం లేకపోవడంతో ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి. ప్రజలు తమ ఇంట్లో ఉన్న వ్యర్థాలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి బజార్లలో పడేస్తున్నారు. వేకువ జామునే పారిశుద్ధ్య కార్మికులు వీధులను శుభ్రం చేయడానికి రాగా చెత్తకుప్పలు పేరుకుంటున్నాయి. ఎవరికి వారు ఇష్టం వచ్చినట్లుగా రోడ్డుపైకి చెత్తను విసరేస్తూ బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నారు. అపార్ట్‌మెంట్లలో ఉన్నవారు చెత్తను బండిద్వారా తరలించే అవకాశాన్ని ఉపయోగించుకుంటున్నారు. కొందరు మాత్రం ఇళ్లముందుకు చెత్తబండ్లు వచ్చినా వారికి డబ్బులు ఇవ్వాల్సి వస్తుందన్న కారణంగా రోడ్డుపై పడేస్తున్నారు. వీధులను శుభ్ర చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు తిడుతున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. స్వచ్ఛ హైదరాబాద్ కోసం చేస్తున్న ప్రయత్నాలు దెబ్బతినడానికి వరీఏ కారణంగా చూడాలి. ఇప్పటికే విపరీతమైన పట్టణీకరణ కారణంగా స్వచ్ఛమైన గాలి కూడా పీల్చడానికి వీలు లేకుండా పోతోంది. రోజువారీ వొత్తిళ్లనుంచి కాస్తంత దూరంగా జరిగి విశ్రాంతి తీసుకునే చోటు మిగలలేదు. సమాజ శ్వాసకోశాలుగా పేరుపడ్డ ఉద్యానవనాలను పట్టించుకోవడం లేదు. వాటి దుస్థితి తొలగించి తమ ఆయు రారోగ్యాలు కాపాడుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదని ప్రజలు వాపోతున్నారు. పట్టణాలతో పాటు శివారు పంచాయతీల్లో సైతం కాంక్రీటు భవనాలు లేచిపోతున్నాయి. చెట్టూచేమలూ నరికివేతకు గురై, పొలాలు చదును చేయబడి రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోతున్నాయి. మహావృక్షాలను మింగుతూ రహదారులు వెడల్పు అయిపోతున్నాయి. 'పచ్చదనం ఒకప్పుడు ండేది' అనిపించేలా పట్టణం తోపాటు పరిసర పంచాయతీల విస్తరణ శరవేగంగా జరుగుతోంది. పచ్చదనం కూలుతున్నప్పుడల్లా పర్యావరణ ప్రేమికులు ఒక నిట్టూర్పు విడిచి ఊరుకుండడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు. పోనీ పంచాయతీ ఉద్యావననాల్లోనైనా పచ్చదనం కనిపిస్తోందా అంటే అదీ లేదు. పంచాయతీల్లో సైతం ఉన్న పచ్చదనం కానరావడం లేదు. పాతుకపోయిన వృక్షాలు ఒకట్రెండు మొండిగా నిలిచి ఉన్నాయి తప్ప అంతకుమించి పచ్చదనం ఈ ఉద్యానవనంలో మచ్చుకు కూడా కనిపించడంలేదు. అసలు ఉద్యానం రూపే లేకుండా పోయింది. ఎన్ని వన మహోత్సవాలు, హరితహారం వంటి పథకాలు వచ్చిపోయినా.. ఒక్క మొక్కనాటి నీళ్లు పోసేవారు. లేకుండా పోయారు. పోనీ.. కనీనం పరిశుభ్రంగానైనా పరిసరాలను ఉంచుతున్నారా అంటే అదీ లేదు. ఎక్కడపడితే అక్కడ బాటిళ్లు, రేకులు, పైపులు, ఇరత్రా వ్యర్థాలన్నీ రోడ్డుకు ఇరువైపులా, కాల్వల్లో పడేస్తున్నారు. ఇలా పడేసిన, నిలబెట్టిన వస్తువులు, పాడైపోయిన వాహనాలు, పరికరాలతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ఖాళీస్థలాలు డంపింగ్ యార్డును తలపిస్తోంది. చెట్లనుంచి రాలిన చెత్తాచెదారాల కుప్పలు వీటన్నింటితో కలిసి అపరిశుభ్ర వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. స్వచ్ఛమైన పచ్చిగాలి పీల్చడం మాటటుంచి అపరిశుభ్ర వాతావరణంతో లేనిపోని రోగాలు అంటుకునే ప్రమాదం ఉంది.

మంత్రికి కోవాగ్జిన్ టీకా ట్రయల్స్

చండీఘడ్,నవంబర్20(ఆర్ఎన్ఎ): హర్యానా ఆరోగ్య శాఖ మంత్రి అనిల్ విజ్.. కోవాగ్జిన్ టీకా ట్రయల్ డోసు తీసుకున్నారు. అంబాలాలోని ఓ హాస్పిటల్‌లో ఆయన ఇవాళ కోవిడ్ టీకాను వేయించుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ సంస్థ కోవాగ్జిన్ టీకాను రూపొందిస్తున్నది. అయితే ఇవాళ కోవాగ్జిన్ మూడవ దశ ట్రయల్స్ దేశంలో ప్రారంభం అయ్యాయి. ఈ నేపథ్యంలో హర్యానా మంత్రి అనిల్ విజ్.. వాలంటీర్ రూపంలో కోవాగ్జిన్ టీకా వేయించుకున్నారు.

చుక్కా రామయ్యను కలిసిన ఎర్రబెల్లి

పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి

హైదరాబాద్,నవంబర్20(ఆర్

బ్యాటరీ కార్ల కొనుగోళ్లపై అనాసక్తి

-తక్కువ ఖర్చవుతున్నా పట్టింపు మృగ్యం

కడప,నవంబరు20(ఆర్ఎన్ఎ): పర్యావరణ కాలుష్య నియంత్రణలో భాగంగా తొలి అడుగుగా ప్రభుత్వ కార్యాలయాల్లో బ్యాటరీ కార్లు వాడకం చేపట్టాలన్న పక్రియకు బ్రేక్ పడేలా ఉంది. కేంద్ర ప్రభుత్వం సారథ్యంలోని ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా కొనుగోళ్లు చేయాల్సిన బ్యాటరీ కార్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపకపోవడంతో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన కార్లతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది. వంద కిలోమీటర్ల మేర ప్రయాణానికి సంబంధించి బ్యాటరీ చార్జింగ్‌కు కేవలం 16 యూనిట్లు ఖర్చవుతోంది. ఇంట్లో కానీ, కార్యాలయంలో కానీ త్రీఫేస్ కనెక్షన్ ఉంటే సులభంగా చార్జింగ్ చేసుకునే వెసులుబాటు ఉంటుంది. దూరప్రాంతాలు కాకుండా రోజూ నగరంలో తిరిగేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. అంటే ఒకసారి చార్జింగ్ చేస్తే కనీసం మూడురోజులు పనిచేస్తుందని నెడ్‌క్యాప్ అధికారులు లెక్కగట్టారు. ఈ కార్ల వినియోగం వల్ల పొగ బెడద తప్పి పర్యావరణ కాలుష్యం నియంత్రణలోకి వస్తుంది. ఈ బ్యాటరీ కారు ధర రూ.12లక్షలు. ఒకేసారి కొనుగోలు చేస్తే లక్ష రూపాయలు రాయితీ ఉంటుంది. అదే కార్యాలయాలకైతే నెలకు రూ.20వేల చొప్పున 72 నెలలు చెల్లించే అవకాశం కల్పిస్తున్నారు. కంతుల రూపంలో చెల్లించే వెసులుబాటు ఉన్నా ప్రభుత్వం శాఖలకు అనుమతినివ్వకపోవడంతో బ్యాటరీ కార్ల కథ కంచికి చేరనట్లేననిపిస్తోంది. పెట్రో ఇబ్బందులను అధిగమించి పర్యావరణ పరిరక్షణలో భాగంగా బ్యాటరీ కార్ల తయారీకి కేంద్ర ప్రభుత్వం సంకల్పించి ఉత్పత్తి, సరఫరా కోసం ఈఈఎ?సఎలను స్థాపించింది. ఇప్పటికే ఉత్పత్తులు ప్రారంభ మయ్యాయి. నెడ్‌క్యాప్ ద్వారా సరఫరా కార్యక్రమం చేపట్టారు. తొలుత జిల్లా ప్రధాన కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలకు, అనంతరం రెవెన్యూ డివిజన్, మండల కేంద్రాలకు విస్తరించేందుకు కార్యాచరణ రూపొందించారు. పర్యావరణ కాలుష్య నియంత్రణ, పెట్రో డీజలు ఖర్చు తగ్గింపు కోసం రూపొందించిన బ్యాటరీ కార్ల వినియోగం జిల్లాలో కొరవడింది. గతంలో కలెక్టరు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు బ్యాటరీ కార్ల ఆవశ్యకత, అవసరంపై వివరించారు. జిల్లా కేంద్రమైన కడపలో దాదాపు 30 శాఖల ప్రధాన కార్యాలయాలున్నాయి. వీటితో పాటు రెవెన్యూ డివిజన్ కేంద్రాల కార్యాలయాలను కలుపుకుని దాదాపు వంద కార్లు తీసుకోవచ్చన్న అంచనాలు ఉండేవి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వీటిపై ఆసక్తి చూపించకపోవడంతో జిల్లాకు అదనంగా బ్యాటరీ కార్లు వచ్చే అవకాశాలు ఇక లేనట్టేనని భావిస్తున్నారు.

కరోనాతో తగ్గిన భూ రిజిస్ట్రేషన్లు

సర్కార్‌కు పడిపోయిన ఆదాయం

అనంతపురం,నవంబరు20(ఆర్ఎన్ఎ): జిల్లాలో భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు మందకొడిగా జరుగుతున్నాయి. గత రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది ఇప్పటివరకు అనంతపురం, హిందూపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో భూముల విక్రయాలు పడిపోయాయని తెలుస్తోంది. తద్వారా ప్రభుత్వానికి ఆదాయం తగ్గినట్లయింది. జిల్లాలో భూముల క్రయవిక్రయాలు తగ్గినమాట వాస్తవమేనని అధికారులు కూడా అంగీకరిస్తున్నారు. జిల్లాలోని అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 12, హిందూపురం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 9 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో ఎక్కడా ఆశించినా స్థాయిలో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. ఇటీవలి గణాంకాలు పరిశీలిస్తే జిల్లాలో భూముల విక్రయాలు తగ్గుతూనే ఉన్నాయి. కరోనా నేపథ్యంలో క్రయవిక్రయాలు తగ్గాయి. వ్యాపారాలు తగ్గడం కూడా కారణంగా చెబుతున్నారు. ఒకవైపు ధరలు పెంచడం, మరోవైపు సంస్కరణల పేరుతో పలు విధానాలు అమలు చేయడం, ఇంకోవైపు కరువు, తదితర కారణాలతో జిల్లాలో క్రయవిక్రయదారులు రిజిస్ట్రేషన్లపై మక్కువ చూపడం లేదు. దీనికి తోడు డబుల్రిజిస్ట్రేషన్లు, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసాలకు పాల్పడడం వంటి కారణాలతో విక్రయదారులు భూములు కొనుగోలు చేయాలంటేనే భయాందోళనలు చెందుతున్నారు. సాధారణంగా ప్రతి ఏడాదీ డిసెంబర్ నుంచి రిజిస్ట్రేషన్లు పెరుగుతాయి. ఈ ఏడాది కూడా పెంచేందుకు కృషి చేస్తామని అధికారులు అని అంటున్నారు.

చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సత్యప్రభ హఠాన్మరణం

సంతాపం తెలిపిన చంద్రబాబు, టిడిపి నేతలు

చిత్తూరు,నవంబర్20(ఆర్ఎన్ఎ): చిత్తూరు మాజీ ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే సత్యప్రభ (65) కన్నుమూశారు. అనారోగ్యంతో బెంగళూరులోని వైదేహి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె గురువారం రాత్రి గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. దీంతో ఆమెకు నివాళులు అర్పించడానికి జిల్లా నుంచి అభిమానులు, టీడీపీ నేతలు బెంగుళూరుకు బయల్దేరి వెళ్లారు. ఇటీవలే ఆమె కరోనా నుంచి కూడా కోలుకున్నారు. టీటీడీ మాజీ ఛైర్మన్ డీకే ఆదికేశవులు నాయుడు సతీమణి అయిన సత్యప్రభ.. ఆయన మృతితో రాజకీయాల్లోకి వచ్చారు. 2014 ఎన్నికల్లో చిత్తూరు అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలిచారు. ఆ తరువాత 2019 ఎన్నికల్లో రాజంపేట అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఇటీవలే సత్యప్రభ టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా రెండోసారి ఎన్నికయ్యారు. ఆమె మృతికి చంద్రబాబు, అచ్చన్నాయుడు సహా పార్టీనేతలు సంతాపం ప్రకటించారు. సత్యప్రభ హఠాన్మరణం పట్ల టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపాన్ని తెలియజేశారు. చిత్తూరు శాసనసభ్యురాలిగా ఆమె సేవలను కొనియాడారు. తాగునీటి కొరత నివారణకు, చెరువుల అభివృద్ధికి కృషి చేశారని బాబు ప్రశంసించారు. తమ పారిశ్రామిక, విద్యాసంస్థలలో ఎందరికో ఉపాధి కల్పించారని గుర్తుచేశారు. శ్రీనివాస ట్రస్ట్ ద్వారా జిల్లాలో డీకే కుటుంబం అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. డీకే కుటుంబ సభ్యులకు చంద్రబాబు నాయుడు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యప్రభ మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. సత్యప్రభ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే సత్యప్రభ మరణం పార్టీకి, కార్యకర్తలకు తీరని లోటన్నారు. ఆమె తుది శ్వాస విడిచారన్న మాట జీర్ణించుకోలేపోయానని అచ్చెన్నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. డీకే సత్యప్రభ మృతిపై పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రివర్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సత్యప్రభ మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నానని సోమిరెడ్డి తెలిపారు. టీడీపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే డీకే సత్యప్రభ మృతి పట్ల టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంతాపం తెలిపారు.

చిత్తూరు ఎమ్మెల్యేగా ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతగానో కృషి చేసి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారన్నారు. శ్రీనివాస ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎంతో మందికి అండగా నిలిచారని తెలిపారు. విద్యాసంస్థలు, పరిశ్రమల ద్వారా ఎంతో మందికి ఉపాధి కల్పించిన సత్యప్రభ మృతి తీరనిలోటన్నారు. వారి కుటుంబ సభ్యులకు లోకేష్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఎన్నికల నియమావళి మేరకు నడుచుకోవాలి

మార్గదర్శకాలను విడుదల చేసిన జిహెచ్ఎంసి

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): గ్రేటర్‌లో అభ్యర్థులు, పార్టీలు ఎన్నికల నియమావళిని పాటించాలని జీహెచ్ఎంసీ పేర్కొంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను వెలువరించింది. గోడలమీద వ్రాతలు, పోస్టర్లు అంటించడం నిషేధించింది. వీలైనంత మేర ప్లాస్టిక్, పాలిథిన్ బ్యానర్లు నివారించాలంది. ఎన్నికల కరపత్రంపై ముద్రించినవారి పేరు, అడ్రస్ ఉండాలని తెలిపింది. ప్రత్యేక ఉపకరణాల ఖర్చును అభ్యర్థి వ్యవపట్టికలో నమోదు చేయాలని సూచించింది. పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారం నిలిపివేయాలంది. లౌడ్ స్పీకర్లకు అనుమతి పొందాలని ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల మధ్యలోనే స్పీకర్లకు అనుమతి ఉన్నట్లు వెల్లడించింది. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల మధ్యలో రోడ్ షోలకు అనుమతిచ్చింది. రాత్రి 10 గంటల తర్వాత బహిరంగ సమావేశాలపై అదేవిధంగా పోలింగ్‌కు 48 గంటల ముందే సమావేశాలను నిషేధించింది. సిబ్బంది ద్వారా ఓటర్లకు అధికారిక గుర్తింపు పత్రాలు అందజేస్తామంది.

లాక్‌డౌన్ తుగ్లక్ చర్య: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ,నవంబర్20(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి ధ్వజమెత్తారు. కరోనా సమయంలో లాక్‌డౌన్ విధింపు తుగ్లక్ చర్య అని, దీంతో చాలా మంది కార్మికులు రోడ్డున పడ్డారని మండిపడ్డారు. మొట్ట మొదట తుగ్లక్ చర్య లాంటి లాక్‌డౌన్ విధించారు. దీంతో లక్షలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. నరేగా ద్వారా వచ్చే డబ్బులను కూడా బ్యాంకుల నుంచి తీసుకోవడం కార్మికులకు కష్టతరమైంది. మోదీ ప్రభుత్వానివి కేవలం మాటలే. పేద ప్రజల హక్కులను కాలరాస్తోందని అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

ఐసిడిఎస్‌ను ఎత్తివేసేందుకు కేంద్రం కుట్రలు

ప్రతిఘటనా పోరాటాలకు సన్నద్ధం కావాలి
26న జరిగే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనాలి
చంద్రబాబు, జగన్ పాలనకు తేడా లేదు
శ్రమ జీవులను ఐక్యం చేసే దిశగా అడుగులు : గఫూర్

విజయవాడ,నవంబర్20(ఆర్ఎన్ఎ): అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ప్రతిఘటనా పోరాటాలకు సన్నద్ధం కావాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గఫూర్ పిలుపునిచ్చారు. 26న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే ఆయా కేంద్రాలను మెర్జ్ చేస్తుందని గమనించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతలో భాగంగా చేయాల్సిన సంక్షేమ కార్యక్రమాలను ఒక్కొక్కటిగా ఎత్తివేసేలా ప్రపంచబ్యాంకు ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఐసిడిఎస్ వ్యవస్థ ఉంటుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటి వరకూ సాధించుకున్న హక్కులతోనే సరిపెట్టుకుందామని అనుకుంటే మన మనుగడనే కోల్పోయే ప్రమాదం పొంచి వుందని ఆయన హెచ్చరించారు. రెండు దశబ్దాలుగా పోరాడి సాధించు కున్న హక్కులను కాలరాసేందుకు ప్రస్తుతం కేంద్రంలో పాలన సాగిస్తున్న బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని పేర్కొన్నారు. నాటి నుంచి నేటి వరకూ చేసిన పోరాటాల ఫలితంగా కొంతమేరకు మన హక్కులను కాపాడుకోవడంలో అంగన్‌వాడీలు, హెల్పర్లు సఫలీకృతుల య్యారని అన్నారు. మనం పడుతున్న కష్టానికి తగిన ప్రతిఫలం కావాలని చేస్తున్న పోరాటాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రస్తుతం కుట్రలు జరుగుతున్నాయని అన్నారు. కేంద్ర కార్మిక సంస్థ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని చెప్పినా కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెడుతుందన్నారు. కనీస వేతనం రూ.21 వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. ప్రస్తుతం రైల్వే రంగాన్ని ప్రైవేటీకరిం చడం ద్వారా ఆ రంగాన్ని సామాన్యులకు దూరం చేసే ప్రయత్నాలను ప్రారంభించిందని తెలిపారు. తద్వారా ప్రస్తుతం రైల్వేరంగం ద్వారా ప్రజలకు అందుతున్న 42 శాతం రాయితీలను ఎత్తివేసేందుకు కుట్రలు సాగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఆఖరికి దేశ రక్షణకు సంబంధించిన రక్షణ రంగాన్ని సైతం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో అంగన్‌వాడీలు భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ అండ్ హెల్పర్స్ జాతీయ కార్యదర్శి ఎకె సింధూ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ వ్యవస్థలో 28 లక్షల మంది ఉంటే మన సంఘంలో ఐదు లక్షలు మాత్రమే ఉన్నారని, మిగిలిన వారిని సంఘంతో కలిసివచ్చేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఐసిడిఎస్‌ను పూర్తి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో అంగన్‌వాడీలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగాన్ని హత్య చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందన్నారు. సేవా రంగాన్ని సైతం నాశనం చేసే దిశగా కేంద్రప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని అన్నారు. లేకపోతే అంగన్‌వాడీ వ్యవస్థకు కూడా ప్రమాదం పొంచివుందని గ్రహించాలన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు అనుసరించిన విధానాల ఫలితంగానే గత ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పారని, అయితే ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సైతం అదే దిశగా అడుగులు వేస్తుందన్నారు. మానవత్వాన్ని మరచిపోయి కార్మికుల జీవితాలను రోడ్లు పాలు చేసే ప్రయత్నాలను కలిసికట్టుగా తిప్పికొట్టకపోతే రోడ్డున పడటం తప్పదని ఆయన హెచ్చరించారు. ఐసిడిఎస్‌ను కాపాడుకోవడం మన కర్తవ్యంగా భావించాలని పిలుపునిచ్చారు. ఐదు కుటుంబాలు ఉన్నా ఐసిడిఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చినా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. అంగన్‌వాడీ వ్యవస్థ ద్వారానే అక్షరాస్యత పెరుగుతుందని, అటువంటి వ్యవస్థను నిర్మూలించేందుకు జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలని అన్నారు. ఒఎన్‌జిసి, స్టీల్ ఎ÷-లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు జరుగుతున్న కుట్రల నేపథ్యంలో దేశ సంపదను కాపాడుకోవడం కోసం 26వతేదీన జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు అగ్రభాగాన నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

బాల్యాన్ని మింగేస్తున్న స్మార్ట్ ఫోన్‌లు

ఆధునిక టెక్నాలజీతో అనర్థాలు
మానసిక నిపుణుల ఆందోళన

హైదరాబాద్,నవంబరు 20(ఆర్ఎన్ఎ): ఆటపాటలు లేకుండా పుస్తకాలతోనే కుస్తీలు పడుతూ అనేకమంది చిన్నారులు ఒంటరిగా మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఒకప్పుడు అనురాగాలు, అప్యాయతలతో గడిచిన బాల్యం నేడు మారుతున్న సాంకేతికతతో అన్నిరకాల అప్యాయతలను కోల్పోతోంది. కరోనా కాలంగా ఆరేడు నెలలుగా ఇంటికే పరిమితమైన చిన్నారులు టీవీలు, స్మార్ట్‌ఫోన్‌లు, ట్యాబ్‌లు, వీడియో గేమ్స్ వంటివాటితో గడపాల్సి వచ్చింది. మరోవైపు ఆన్‌లైన్ తరగతుల కారణంగా పిల్లలకు స్మార్ట్ ఫోన్లు, ట్యాబ్‌లు, టీవీలు అనివార్యంగా దగ్గరయ్యాయి. ఇరవై ఏళ్ల క్రితం వరకు చిన్నారులకు అన్నం తినిపించాలంటే వారి తల్లులు చందమామను చూపెట్టో, పాటలు పాడో, కథలు చెబుతో తినిపించేవారు. కానీ నేటితరం పిల్లలు స్మార్ట్‌ఫోన్, టీవీలు లేనిది ముద్ద తినడం లేదు. మారుతున్న సాంకేతికత, పరిజ్ఞానం రోజురోజుకూ చిన్నారులను వారి తల్లిదండ్రులకు దూరం చేస్తోంది. ఉద్యోగాలు, వ్యాపారాలు ఇతర బాధ్యతలతో తల్లిదండ్రులు బిజీగా ఉంటూ చిన్నారి పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్న సంస్కృతి నేటి సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతుంది. బాల్యం ప్రతీ ఒక్కరి జీవితంలో ఆనందమైన జ్ఞాపకం. కానీ నేటి తరం చిన్నారులు మాత్రం ఆ ఆనంద క్షణాలకు దూరమవుతూ వారికే తెలియని ఒంటరి జీవితాలను గడుపుతున్నారు. ఉదయం లేవగానే పాఠశాలకు వెళ్లడం సాయంత్రం ఇంటికి రాగానే ట్యూషన్‌లు ఇవి సాధారణంగా పెద్దపిల్లలకు ఉండే రోజు వారి దినచర్యలు. కానీ కరోనా సంక్షోభంతో ఉదయంనుంచి సాయంత్రం వరకు ఇప్పుడు వారికి అవే కాలక్షేపంగా మారాయి. దీనికి విరుగుడు ఆలోచించాలి. పెద్దలు పిల్లకు కథల రూపంలో విద్యను అందించాలి. తల్లిదండ్రులు తమవంతు బాధ్యతగా వారికి చదువు చెప్పాలని నిపుణులు చెబుతున్నారు. ఇపప్పటి వరకు తల్లిదండ్రులు ఇద్దరు ఉద్యోగస్థులైతే ఆ చిన్నారులు సైతం ట్యూషన్‌లకు వెళ్లాల్సిందే. ఇలా పగలంతా చదువులతో కుస్తీ పడుతూ సాయంత్రం ట్యూషన్‌లు ఇంటికి రాగానే టీవో, సెల్‌ఫోన్‌లతో ఆటలు ఇలా చిన్నారుల జీవితాలు అనురాగాలు, అప్యాయతలకు దూరమవుతున్నాయి. ఒకప్పుడు ఉద్యోగరీత్యా, వ్యాపారరీత్యా తల్లిదండ్రులు ఇతర ప్రాంతాలకు వెళితే సాయం త్రానికి పిల్లల కోసం ఇంటికి వచ్చేవారు. నేడు ఎటు వెళ్లినా.. ఫోన్‌లలో వీడియో కాలింగ్ ద్వారా మాట్లాడి దూరంగా ఉంటున్నారు. ఇలా ఒకరకంగా మారుతున్న టెక్నాలజీ వల్ల కొంత ప్ర యోజనాలు ఉన్నా దాని వల్ల అనర్థాలే ఎక్కు వగా ఉంటున్నాయని మానసిక నిపుణులు తెలుపుతున్నారు. తల్లిదండ్రులు ఏం చేస్తున్నారో పిల్లలకు, పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులకు తెలియని పరిస్థితిని దాటాం. కరోనా కారణంగా అంతా ఇంటికే పరిమితం అయ్యారు. ఈ దశలో పిల్లలను ఒంటరిగా ఉండకుండా, అదేపనిగా ఫోన్లకు అలవాటు పడకుండా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆధునిక లైబ్రరీకి తగ్గ హంగులు పెరగాలి

నిరుద్యోగులకు అండగా ఆధునిక పుస్తకాలు పెంచాలి

సిరిసిల్ల,నవంబరు20(ఆర్ఎన్ఎ): సిరిసిల్లకు ఆధునిక లైబ్రరీలో పోటీ పరీక్షలకు తోడు వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని విద్యార్థులు కోరుకుంటున్నారు. అన్నిరంగాల్లో నిష్ణాతులులగా నిలిచేలా లైబ్రరీని మరింత పటిష్టం చేయాల్సి ఉందని వారు అంటున్నారు. పోటీ పరక్షలకు లైబ్రరీలు పనికివచ్చేలా తయారు కావాలన్నారు. అయితే డిజిటల్ లైబ్రరీ మాత్రం ప్రారంభంతోనే మూతపడింది. జిల్లా కేంద్రానికే తలమానికంగా మారిన గ్రంథాలయం మరింత పటిష్టం కావాల్సి ఉంది. జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ రూ.5 లక్షల నిధులను కేటాయించడంతో కొంతమేరకు పుస్తకాలు కొనుగోలు పక్రియ కొనసాగింది. తెలంగాణరాష్ట్రంలో తొలిసారిగా రూ3.60 కోట్లతో సినారే స్మారక జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనాన్ని నిర్మించారు. పూర్తిగా సెంట్రల్ ఏసీతో నిర్మించారు. పాఠకులకు సౌకర్యవంతంగా రీడింగ్ గదులు, సమావేశ మందిరం, లిఫ్ట్ సౌకర్యం కల్పించారు. 60 కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. పురపాలక ఐటీ శాఖ మంత్రి కే తారకరామారావు చేతుల మీదుగా ప్రారంభించారు. అయితే ఇది పాఠకులకు అనుకున్న స్థాయిలో ఉపయోగపడడం లేదు. పాతశాఖ గ్రంథాలయంలోని పుస్తకాలు మాత్రమే ఆధునిక గ్రంథాలయంలోకి మారాయి. గ్రంథాలయానికి కావ లసిన సిబ్బందని నియమించకపోవడంతో అలంకార ప్రాయంగా మారిందన్న విమర్శలు ఉన్నాయి. సిరిసిల్ల నడిబొడ్డున వైట్‌హౌజ్ తరహాలో వెలిగిపోతున్న భవనంలోకి వెళితే మాత్రం పాఠకులకు నిరాశే కలుగుతుంది. జిల్లాలో నిరుద్యోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉండాల్సిన ఈ కేంద్రాలు చదువుకోవడానికి పుస్తకాలు లేక సరైన భవనాలు, సౌకర్యాలు లేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోనే రూ.3.60 కోట్లతో అత్యంత భారీ భవనం హంగులతో సిరిసిల్ల జిల్లాకేంద్రంలో తొలిసారిగా మోడల్ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. సినారె స్మారక గ్రంథాలయంగా నామకరణం చేశారు. సరైన పుస్తకాలు లేక అధ్వాన పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. జిల్లాలో 13 మండలాలు ఉండగా.. కేవలం పాత మండలాల్లోనే గ్రంథాలయ వ్యవస్థ కొనసాగుతోంది. వసతులు లేకపోయినా ఉన్న పుస్తకాలు, పేపర్లతో జిల్లాలో 3 లక్షల 36వేల మంది పాఠకులు గ్రంథాలయాలను ఉపయోగిం చుకుంటున్నారు. సిరిసిల్ల, చందుర్తి, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, బోయినపల్లి, ఇల్లంతకుంట గ్రంథాలయాలకు సొంత భవనాలు ఉన్నా నామమాత్రపు సౌకర్యాలే ఉన్నాయి. మిగితా గ్రంథాలయాలు అద్దె ఇళ్లలో చిన్న గదుల్లో కొనసాగుతున్నాయి. కొన్ని గ్రంథాలయాలకు ఇన్‌చార్జీలు ఉంటే మరికొన్ని గ్రంథాలయాలకు అటెండర్లు, స్వీపర్లు, రికార్డు అసిస్టెంట్లు లైబ్రేరియన్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోనే 35 ఏళ్లుగా గ్రంథాలయం అద్దె భవనంలోనే కొనసాగుతోంది. గంభీరావుపేటలో చాలీచాలనీ గదిలో గ్రంథాలయం ఉండగా 2001లో అదనపు గదుల కోసం అప్పుడు ఎంపీగా ఉన్న సీహెచ్ విద్యాసాగర్‌రావు రూ. 50వేలు మంజూరుచేశారు. నిర్మాణం చేపట్టి నిధుల కొరతతో నిలిచిపోయింది. ఎల్లారెడ్డిపేటలో సొంత భవనం ఉన్నా ప్ర హరీగోడ లేదు. లైబ్రేరియన్ లేకపోవడంతో కథలాపూర్ లైబ్రేరియన్ ఇన్‌చార్జీగా విధులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు ఉన్నత శిఖరాలకు బాటలు వేయాల్సిన గ్రంథాలయాల్లో ఇప్పుడు అసౌకర్యాలు వెంటాడుతున్నాయి.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రోజా

చంద్రబాబుకు రాజకీయాలే ముఖ్యమని విమర్శ

తిరుమల,నవంబర్20(ఆర్ఎన్ఎ): చంద్రబాబు నాయుడి జీవితం మొత్తం వెన్నుపోటు, శవరాజకీయాలకే సరిపోయిందని నగిరి ఎమ్మెల్యే ఆర్కే రోజా అన్నారు. శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కార్తీక మాసంలో స్వామివారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. వెయ్యికాళ్ల మండపం త్వరలో ప్రారంభించేందుకు టీటీడీ చైర్మన్ ఏర్పాట్లు చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా రాజకీయాలు నడుపుతున్నారు. తిరుపతి ఎంపీ కరోనాతో మృతి చెందితే, హడావిడిగా అభ్యర్థిని ప్రకటించి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని బాబు ఎదురు చూస్తున్నారని అన్నారు. కరోనా నివారణ చర్యలకన్నా రాజకీయాలే బాబుకు ముఖ్యమయ్యాయని అన్నారు. కరోనాతో రాష్ట్రం అతలాకుతలం అవుతన్న సమయంలో కూడా 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన వ్యక్తి ప్రజలకు కనీసం భరోసా కూడా కల్పించలేని పరిస్థితి చంద్రబాబుదని మండిపడ్డారు. కరోనా సమయంలో ప్రజల గురించి ఆలోచించకుండా చంద్రబాబు హైదరా బాద్‌లో దాక్కున్నారు. జగన్ పార్టీ పెట్టినప్పటి నుంచి మరణం సంభవించిన కుటుంబంలో పోటీ పెట్టకుండా ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. చంద్రబాబు నాయుడు తన సామాజిక వర్గం వారిని నిలబెట్టేందుకు లోకల్ బాడీ ఎన్నికల కోసం హడావిడి చేస్తున్నారని విమర్శించారు. స్థానిక సంస్థల ఫండ్స్ రాకపోతే అభివృద్ధి కుంటుపడుతుందని ఎన్నికలు పెడితే కరోనా కుంటిసాకు చూపించి ఎన్నికలు వాయిదా పడేలా చేశారు. ఇప్పుడేమో రాష్ట్రంలో కరోనా లేదని పెద్దమనుషులు ఆరాట పడుతూ ఎన్నికలు పెట్టాలని ప్రకటనలు ఇస్తున్నారు. మార్చి లోపల ఎన్నికలు పెడితే టీడీపీ అన్ని స్థానాలు గెలుచుకుంటామనే భ్రమలో ఉంది. రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు అప్పులో ముంచేసారు. అదే రాష్ట్రంలో పదహారు నెలల కాలంలో జగన్ నాలుగున్నర కోట్ల మంది ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చేశారు. కరోనా సమయంలోనూ ప్రజలను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్ మాత్రమే అని రోజా కొనియాడారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమమెల్యే, నటి రోజా

గ్రేటర్ ఎన్నికలకు వైకాపా దూరం

హైదరాబాద్,నవంబర్19(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలపై వైఎస్సార్ కాంగ్రెస

కలగానే మారిన నిర్మల్ రైల్వే లైన్

ఎంపి సోయం బాపూరావు కృషిపైనే ఆశలు

నిర్మల్,నవంబరు20(ఆర్ఎన్ఎ): దశాబ్దాల నుంచి నిర్మల్ జిల్లా కేంద్ర ప్రజలు ఎదురుచూస్తున్న రైల్వే లైన్ నిర్మాణం కలగానే మిగిలిపోతోంది. దీంతో తాజాగా ఆదిలాబాద్ బిజెపి ఎంపి సోయం బాపూరావు రంగంలోకి దిగారు. మరోమారు దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకుని వెళతానని హామీ ఇచ్చారు. గతంలో యూపీఏ ప్రభుత్వం ఈ రైల్వే లైన్ నిర్మాణం కోసం దాదాపు రూ. 5 కోట్ల వ్యయంతో సర్వే చేపట్టింది.

దాదాపు 119 కిలో మీటర్ల పొడవుతో నిర్మించాల్సిన పనుల వ్యవహారం అప్పట్లో సర్వేలకే పరిమితమయ్యింది. కేంద్ర రైల్వే ఇంజినీరింగ్ అధికారులు అప్పటి సర్కారుకు నివేదించిన సర్వే ప్రతిపాదనలు మరుగున పడిపోయాయి. దీనిపై సోయం బాపురావు సైతం స్పందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖ ఈ నిర్మాణం పట్ల సుముఖంగా ఉన్నట్లు పేర్కొంటున్నారు. సంప్రదింపుల పక్రియ సక్సెస్ అయితే పార్లమెంట్ శీతకాల సమావేశాల సందర్భంగా నిధులకు సంబంధించిన ప్రకటన వెలువడే అవకాశాలు లేకపోలేదంటున్నారు. స్థానికులు రైల్వే లైన్ నిర్మా ణానికి డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అ ప్పట్లో దీని వైపు దృష్టి కేంద్రీకరించింది.

కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కేటాయించక పోవడంతో సీఎం కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగి ఆర్మూర్ టూ ఆదిలాబాద్ రైల్వే లైన్‌పై చర్యలు తీసుకుంటామంటూ హామీనిచ్చారు. అవసరమైతే నిధుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా వాటా ఇస్తామని ప్రకటించిన క్రమంలో కేంద్ర ప్రభుత్వం సైతం నిధులు ఇచ్చేందుకు ముందుకు వచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల నుంచి ఈ నిర్మాణం కోసం నయా పైసా కూడా తన వాటాగా కేంద్రానికి చెల్లించక పోవడంతో ఈ వ్యవహారం మూలన పడిందన్న విమర్శలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉండడంతో జిల్లాకు చెందిన ఎంపీ సోయం బాపురావు మళ్లీ ఆర్మూర్ టూ ఆదిలాబాద్ వయా నిర్మల్ రైల్వే లైన్ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు.

సోయం బాపురావు ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తే పనులకు వెూక్షం లభించే అవకాశం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ఆర్మూర్ టూ ఆదిలాబా ద్ రైల్వేలైన్ నిర్మాణానికి హామీనివ్వడమే కాకుండా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇచ్చేందుకు వెనకాడినట్లయితే సగం నిధులు తాము భరిస్తామంటూ ప్రకటించింది. ఎన్నికల సమయంలో బీజేపీ తరపున తానిచ్చిన హామీకి కట్టుబడి ఉండేందు కోసం ఎంపీ సోయం బాపురావు మరుగున పడ్డ ఆర్మూర్ టూ ఆదిలాబాద్ రైల్వే లైన్ నిర్మాణ ప్రతిపాదనను తెరపైకి తెస్తున్నారు. ఇందులో భాగంగానే ఆయన ఇప్పటికే మూడుసార్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రికి ఈ విషయమై విజ్ఞాపనలు చేశారు. అటు కేంద్ర రైల్వే శాఖ మంత్రితో పాటు ఇటు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులతో కూడా సంప్రదింపులు జరుపుతూ ఎలాగైనా బడ్జెట్‌లో దీని కోసం నిధులు కేటాయించేట్లు చూసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు 119 కిలో మీటర్ల పొడవుతో రైల్వే లైన్ నిర్మించినట్లయితే ఈ ప్రాంతమంతా పెద్ద ఎత్తున అభివృద్ధికి నోచుకునే అవకాశాలు ఉన్నాయి. రైల్వేలైన్ సౌకర్యం లేని కారణంగా ఈ ప్రాంతంలో ఒక్క భారీ పరిశ్రమ కూడా ఏర్పా టు కావడం లేదు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపు

విశాఖపట్నం,నవంబర్20(ఆర్ఎన్ఎ): దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకంగా చేస్తున్నా నిరంకుశ చట్టాలను రద్దు చేయాలని ఈనెల 26న దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపునిచ్చింది. శుక్రవారం కొమ్మాది కోడలి లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు మధురవాడ జోన్ అధ్యక్షులు డి అప్పలరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో వైయస్సార్ సిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన అప్పటినుండి భవన నిర్మాణ కార్మికులు అనేక కష్టాలు పడుతున్నారని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు లో నిధులు మూలుగుతున్న కార్మికుల సంక్షేమం కోసం వారి కష్టాలు తీర్చడానికి ఉపయోగించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వం సంక్షేమ బోర్డు నిధుల్ని 450 కోట్లు ఇతర అవసరాల కోసం వాడు కుందని తెలియజేశారు. ఇప్పటి వైయస్సార్సీపి ప్రభుత్వం సుమారు ఎనిమిది వందల కోట్లు సంక్షేమ బోర్డు నిధుల్ని ఇతర పథకాలకు వాడు కుందని అన్నారు. రెరడు ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులకు అన్యాయం చేశారని తెలియజేశారు. సుప్రీంకోర్టు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ఇతర అవసరాల కోసం ఖర్చు చేయకూడదని హెచ్చరించిన ఈ ప్రభుత్వాలకు పట్టడం లేదని అన్నారు. మరోపక్క కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మొత్తం సంక్షేమ బోర్డు ని ఎత్తి వేయాలని లేబర్ కోర్టు లో భాగంగా చూస్తుందని అన్నారు కార్మికుల పోరాటం వల్ల కొంతవరకు ఆపగలిగారు అని అన్నారు. బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విధానాలను వ్యతిరేకిస్తున్నాయని అన్నారు. మన రాష్ట్రంలో మాత్రం బీజేపీతో పాటు తెలుగుదేశం వై ఎస్ ఆర్ సి పి జనసేన పార్టీ లు అన్ని ఈ కార్మిక ప్రజా లా రైతు వ్యతిరేక చర్యలను సమర్ధిస్తున్నాయి అని అన్నారు. ఇది ఇది ప్రజలకు చాలా ప్రమాదమని హెచ్చరించారు ప్రజల మేలుకోకపోతే రానున్న రోజుల్లో తీవ్రంగా ప్రమాదంలో పడతారని అన్నారు. వైయస్సార్సీపి ప్రభుత్వం ఇసుక విధానంలో మార్పు తీసుకువచ్చి కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని అన్నారు. అదేవిధంగా కరోనా కష్టకాలంలో కాలంలో ఉపాధి కోల్పోయారని తెలియజేశాను. అయినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల ను ఆదుకునే చర్యలు చేపట్టకపోవడం అన్యాయమన్నారు. ఇప్పటికీ భవన నిర్మాణ కార్మికులు పూర్తిస్థాయిలో ఉపాధి లేక తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత ప్రభుత్వం ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం మళ్లించిన భవన నిర్మాణ కార్మికులు నిధులను వెనక్కి ఇచ్చి ప్రతి కార్మికునికి పదివేల రూపాయలు నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు పెండింగ్లో ఉన్న ÷-లక్రైమ్ లన్నీ ఇవ్వాలని కోరారు. ప్రజలందరూ ఈ సమ్మెలో భాగస్వాములై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి రాజశేఖర్ అధ్యక్షత వహించారు వి నారాయణ రావు కే తిరుపతిరావు వెూహన్ రావు ఏ సత్యనారాయణ సూర్యనారాయణ రామలక్ష్మి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

26న సమ్మెకు మద్దతుగా ప్రచార జాతా ప్రారంభం

ఏలూరు,నవంబర్20(ఆర్ఎన్ఎ): ఈనెల 26న జరిగే దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతా నిర్వహించాలనే ఐ.ఎఫ్.టి.యు. రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈరోజు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ఐ.ఎఫ్.టి.యు.నగర కమిటీ 'ప్రచార జాతా'ను ప్రారంభించింది. ఏలూరు జూట్ మిల్లు దగ్గర ఈ జాతా మొదలైంది. ఒక వాహనానికి ప్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు, మైక్ ఏర్పాటు చేసి 'ప్రచార రథాన్ని' తయారు చేశారు. ఈ ప్రచార రథం ద్వారా ఏలూరు, చుట్టుపక్కల మండలాల్లో మూడు రోజుల పాటు ప్రచారం చేయనున్నట్లు నాయకులు తెలియజేశారు. ఏలూరు జూట్ మిల్లు దగ్గర ఐ.ఎఫ్.టి.యు నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు జాతాను ప్రారంభించి, మాట్లాడారు. దేశంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల పైన ప్రధానమైన దాడి కేంద్రీకరించిందని ఆరోపించారు. సమాజ అవసరాలను తీర్చే వస్తువులను ఉత్పత్తి చేసే ప్రధానమైన రెరడు రంగాలైన అటు వ్యవసాయ రంగం,ఇటు పారిశ్రామిక రంగాలపైన తీవ్రమైన ప్రభావం చూపే విధంగా మోడీ ప్రభుత్వం సంస్కరణలు చేపట్టిందని విమర్శించారు. కార్మిక చట్టాలను యజమానులకు అనుకూలంగా సవరిస్తూ నాలుగు కోడ్ లు తీసుకురావటం, రైతుల సంక్షేమం పేరుతో తీసుకొచ్చిన 3 వ్యవసాయ చట్టాలను పార్లమెంటులో ఆమోదించటం, ప్రజలపై భారాలు మోపుతూ విద్యుత్ సంస్కరణల చట్టం తీసుకురావడం ద్వారా తమ ప్రజా వ్యతిరేక నిర్ణయాలను వారే చాటిచెప్పుకున్నారని ఆయన తెలియజేశారు. కార్మిక, కర్షక, ఉద్యోగ, ప్రజల హక్కుల పరిరక్షణకై సమ్మె జరుగుతున్నదని వివరించారు. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల తర్వాత జరుగుతున్న 19వ సమ్మెగా అభివర్ణించారు. మోడీ ప్రభుత్వం దేశంలో ఫాసిస్టు విధానాలకు పునాదులు వేసిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడం ద్వారా రైతు వ్యతిరేక ప్రభుత్వంమని నిరూపించు కుందన్నారు. కార్మికులకు నెలకు ఇరవై ఒక్క వేల రూపాయల జీతం నిర్ణయించి,అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ, అసంఘటిత కార్మికులకు ఉపాధి భద్రతతో కూడిన సమగ్ర చట్టం చేయాలనీ, నిర్మాణ కార్మికులకు 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఈ సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. జూట్ మిల్లు విధులకి వెళ్లి,వచ్చే కార్మికులకు విస్తృతంగా ప్రచారం చేశారు. అనంతరం పట్టణంలోని వివిధ ప్రాంతా లలో ప్రచార జాతా కొనసాగించారు చుట్టల కార్మికులు, హమాలీ కార్మికులు, వివిధ ఫ్యాక్టరీల వద్ద గ్రూపు మీటింగులు నిర్వహించి ప్రచారం చేశారు. ప్రచార జాతా ఉధృతంగా సాగు తున్నది. మరో రెరడు రోజులపాటు ఈజాతా కొనసాగు తుంది. ఈ కార్యక్రమ ములో ఐ.ఎఫ్.టి.యు. నగర అధ్యక్షులు కాకర్ల అప్పారావు, నగర నాయకులు కె.నూక రాజు,జి. రాంబాబు, రమణ, కొం డా, అప్పారావు, టి.ఈశ్వర రావు, గురు మూర్తి, బి.భద్రం,కాకర్ల శ్రీను,ఎన్.నెహ్రూ, జి.నాగేశ్వరరావు,ధర్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ వేములవాడ పట్టణంగా తీర్చిదిద్దాలి

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి -మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి రాజు

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):ప్రతి ఒక్కరూ స్వచ్ఛ తెలంగాణలో భాగంగా పారిశుద్ధ్య చర్యలు

చేపట్టి స్వచ్ఛ వేములవాడ పట్టణంగా తీర్చి దిద్దాలని వేములవాడ మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థ పు మాధవి రాజు అన్నారు .స్వచ్ఛ తెలంగాణలో భాగంగా ప్రతి ఇంటికి తడి పొడి చెత్త బుట్టలు పంపిణీ చేస్తున్నామని ఇందులో భాగంగానే వేములవాడ మున్సిపల్ పరిధిలో విలీనమైన నాంపల్లి గ్రామంలోని 5, 6 వార్డులో శుక్రవారం వార్డు ప్రజలకు దాదాపు 1300ల చెత్త బుట్టలను తడి పొడి చెత్త బుట్టలు పంపిణీ చేసి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు ఆదేశాల మేరకు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ అభివృద్ధి కార్యక్రమంలో వార్డు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ తెలంగాణ లో భాగంగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టి స్వచ్ఛ వేములవాడ పట్టణంగా తీర్చిదిద్దాలని తెలిపారు.

ఇప్పటివరకు మిగిలిన గ్రామాల్లో 6 లక్షల రూపాయలు వెచ్చించి చెత్త బుట్టలు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మధు రాజేందర్, కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వార్డు కౌన్సిలర్లు నీలం కళ్యాణి శేఖర్, జడల లక్ష్మి శ్రీనివాస్ వార్డు ప్రజలు ఉన్నారు.

కమలాహారిస్‌కు ప్రియాంక శుభాకాంక్షలు

న్యూఢిల్లీ,నవంబర్20(ఆర్ఎన్ఎ): ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా అమెరికా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కమలాహారీస్‌ని కాంగ్రెస్ నేత, ప్రియాంకా గాంధీ ట్విట్టర్ ద్వారా అభినందించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలందరికీ ఇందిరాగాంధీ బలం, ధైర్యం... ప్రేరణగా నిలుస్తాయని అన్నారు. యాభై సంవత్సరాల క్రితమే ఇందిర దేశ ప్రధాని అయ్యారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఇందిరాగాంధీ దేశంలోనే ఏకైక మహిళా ప్రధానమంత్రి. జనవరి, 1966 నుండి మార్చి, 1977 వరకు... తిరిగి జనవరి, 1980 నుండి అక్టోబర్ 1984లో ఆమె హత్యకు గురైనంతవరకు ప్రధానిగా కొనసాగిన విషయం తెలిసిందే.

కెసిఆర్‌కు బిజెపి భయం పట్టుకుంది

ఎంఐఎంతో కలసి గెలవాలనుకుంటున్నాడు వరదసాయం ఇవ్వకుండా ఎన్నికలు పెట్టిందెవరు? కెసిఆర్‌పై మండిపడ్డ బిజెపి నేత డికె అరుణ

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): సిఎం కేసీఆర్‌కు బీజేపీ అంటే భయం పట్టుకుందని..ఆ భయంతోనే దొంగ లెటర్లు సృష్టిస్తున్నారని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. . భయంతో కేసీఆర్‌కు నిద్రపట్టడం లేదన్నారు. టీఆర్ఎస్ ఇచ్చే వరద సాయం రూ.10 వేలు ఏ మూలకు సరిపోతాయన్నారు. ఓట్ల కోసమే ఎలాంటి లెక్క లేకుండా పైసలు పంపిణీ చేశారన్నారు. వరద సాయం రూ.550 కోట్లిచ్చిందన్నారు. డబ్బులు అకౌంట్లో వేయకుండా టీఆర్ఎస్ కార్యకర్తల జేబులో వేశారన్నారు. వరదసాయం అడ్డుకుం టున్నారని అంటున్న వారు ఎందుకు ఎన్నికలకు పోయారో చెప్పాలన్నారు. అందరికి రూ.10 వేలు ఇచ్చాకే ఎన్నికల నోటిఫికేషన జారీ చేయాల్సిందన్నారు. నోటిఫికేషన్ ఇచ్చింది మీరే. .వరద సాయం ఆపింది మీరేనన్నారు. వరద సాయం పైసలన్నీ టీఆర్ఎస్ నాయకులే తిన్నారన్నారు. ఓటమి భయంతో కేసీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లారన్నారు. ఎన్నికలయ్యాక వరద సాయం రూపాయి కూడా ఇవ్వరన్నారు. కేసీఆర్ కు కావాల్సింది జనాలు కాదు ఓట్లర్లన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి దేశాన్ని అవమానిస్తారా? అని డికె ప్రశ్నించారు. ఎంఐఎం లేకుంటే కేసీఆర్ కు దిక్కే లేదన్నారు. అభివృద్ధి చేస్తే ఇండ్లల్లకు నీళ్లు ఎట్లా వచ్చాయన్నారు. ఎంఐఎం ఏం చేసిందో ముస్లీం సోదరులు ఆలోచించాలన్నారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బీజేపీదే అధికారమన్నారు. కెసిఆర్, ఎంఐఎంలను నమ్మి మోసపోవద్దన్నారు.

గ్రేటర్ ఎన్నికల్లో బిజెపికి జనసేన మద్దతు

సమయాభావంతో పోటీ నుంచి విరమణ పవన్ కళ్యాణ్‌తో ఫలించిన బిజెపి నేతల చర్చలు

ఉమ్మడిగా ముందుకు వెళతామని ప్రకటించిన పవన్ కళ్యాణ్

హైదరాబాద్ అభివృద్ధి కోసం కలసి పని చేస్తామన్న కిషన్ రెడ్డి, లక్ష్మణ్

హైదరాబాద్,నవంబర్20(ఆర్ఎన్ఎ): గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో బిజెపికి మద్దతు పలకాలని జనసేన నిర్ణయించింది. పోటీ చేయకుండా పార్టీకి సంపూర్ణ మద్దతు పలకాలని నిర్ణయించింది. ఈ మేరకు పవన్ కళ్యాణ్‌తో బిజెపి నేతల భేటీ సందర్భంగా జరిగిన చర్చల్లో అవగాహన కుదరింది. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణలో బీజేపీతో కలిసి పనిచేస్తున్నామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ప్రధాని వెూడీ నాయకత్వంలో హైదరాబాద్ విశ్వనగరంగా రూపుదిద్దుకుంటోందన్నారు. హైదరాబాద్‌లో బలమైన నాయకత్వం ఉండాల్సిన అవసరముందని, దీని కోసం బీజేపీకి పూర్తి మద్దతు ఇస్తున్నామని పవన్ ప్రకటించారు. గ్రేటర్ ఎన్నికల క్రమంలో బీజేపీ అగ్రనేతలు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌ను కలిశారు. జనసేన నేత నాదెండ్ల మనోహర్ నివాసంలో భేటీ అయ్యారు. తాజా ఎన్నికల పరిస్థితులపై చర్చించారు. తర్వాత మీడియాతో మాట్లాడిన పవన్ బీజేపీకి జనసేన పూర్తి మద్దతు ఉంటుందన్నారు. ఎన్నికల్లో బీజేపీ గెలవాల్సిన అవసరముందన్నారు. ఒక్క ఓటు కూడా బయటకు వెళ్లకుండా చూడాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జీహెచ్ఎంసీ ఎన్నికలతో పాటు భవిష్యత్తు ఎన్నికల్లోనూ ఇరుపార్టీలు కలిసి వెళ్తాయని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం కోసం తమ పార్టీ అభ్యర్థులు నిరాశ చెందినా?ప్రజల అభివృద్ధి కోసం ఎన్నికల్లో పోటీ చేయకుండా?బీజేపీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఇది తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న నిర్ణయమన్నారు. తెలంగాణలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దీనికి తాజా దుబ్బాక ఉపఎన్నికే నిదర్శనమని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జనసేన తమకు మద్దతివ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీతో కలిసి రావాలని జనసేనను కోరామని, బీజేపీ విజయానికి పూర్తిగా సహకరిస్తామని పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. కేవలం ఈ ఎన్నికల్లోనే కాకుండా భవిష్యత్తులోనూ కలిసి పని చేస్తామని లక్ష్మణ్ తెలిపారు. హడావుడి నోటిఫికేషన్‌తో పూర్తి స్థాయిలో చర్చించుకోలేక పోయామని.. అయినా జనసేన పూర్తి స్థాయిలో బీజేపీకి మద్దతు తెలిపేందుకు అంగీకరించిందని తెలిపారు. బీజేపీకి జనసేన తోడుంటే ప్రజల కలలు నెరవేరుతాయన్నారు. టిఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని?ప్రజలు మార్పుకోరుకుంటున్నారని అది బీజేపీతోనే సాధ్యమన్నారు. ఇప్పటి వరకూ బల్దియా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించిన పవన్ కల్యాణ్ తాజాగా పోటీ చేయడం లేదని ప్రకటించారు. జన సైనికులు బీజేపీకి పూర్తి మద్దతుగా నిలబడాలని పిలుపునిచ్చారు.

ప్రారంభమైన తుంగభద్ర పుష్కరాలు

కర్నూలులో ప్రారంభించి పూజలు చేసిన జగన్ అలంపూర్‌లో ప్రారంభించిన మంత్రులు

కర్నూలు,నవంబర్20(ఆర్ఎన్ఎ): పవిత్రమైన తుంగభద్ర పుష్కరాలను శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలుల ఘనంగా ప్రారంభించారు. తెలంగాణలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి,శ్రీనివాస్ గౌడ్‌లు ప్రారంభించారు. కర్నూలులో పుష్కరాలు ప్రారంభించిన అనంతరం సంకల్‌భాగ్ ఘాట్‌లో సీఎం జగన్ ప్రత్యేక పూజలు నిర్వహించి, హోమంలో పాల్గొన్నారు. కోవిడ్ నేపథ్యంలో ప్రతికూల పరిస్థితులు నెలకొని ఉన్నా, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ ఆర్భాటాలు లేకుండా సంప్రదాయరీతిలో, శాస్త్రోక్తంగా నిర్వహించి పుష్కరాలను విజయవంతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12 ఏళ్లకోసారి వచ్చే పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక జాగ్రత్తలతో అన్ని ఏర్పాట్లు చేసింది. కర్నూలు జిల్లాలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, నందికొట్కూరు, కోడుమూరు, కర్నూలు నియోజకవర్గాల్లో పుష్కరాలకు ఏర్పాట్లు చేశారు. నేటి నుంచి డిసెంబర్ 1వరకు.. 12 రోజులపాటు తుంగభద్ర పుష్కరాలను నిర్వహించనున్నారు. ఐదువేల మంది పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఘాట్ల వద్ద ప్రత్యేకంగా గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచారు. కార్యక్రమంలో సీఎం జగన్ వెంట మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, వెల్లంపల్లి శ్రీనివాస్, గుమ్మనూరు జయరాం, కలెక్టర్ వీరపాండి యన్, ఎస్పీ ఫక్కీరప్ప, ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, కంగాటి శ్రీదేవి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సుధాకర్, తొగురు ఆర్థర్ ఉన్నారు. ఇకపోతే తెలంగాణలోని అలంపూర్ వద్ద తుంగభద్ర పుష్కరాలు శాస్త్రోక్తంగా ప్రారంభం అయ్యాయి. అలంపూర్ ఘాట్ వద్ద మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ హాజరు కాగా.. బ్రాహ్మణులు, వేద పండితులు శాస్త్రోక్తంగా తుంగభద్ర నదీ పూజలు నిర్వహించారు.

టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ సీనియర్ నేత కొండపల్లి మాదవ్

హైదరాబాద్,నవంబర్ 20: బీజేపీ సీనియర్ నాయకులు కొండపల్లి మాదవ్ నేడు అధికార టీఆర్ఎస్ పార్టీలో చేరారు. నగరంలోని అడిక్‌మెట్ డివిజన్ నుంచి ఇతర అనుచరులతో కలిసి నేడు ఆయన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సమక్షంలో గులాబీ వనంలో చేరారు. పార్టీ కండువా కప్పి మాదవ్‌ను సాధరంగా ఆహ్వానించారు కవిత. మన రాష్ట్రం, మన ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నట్లు కవిత ఈ సందర్భంగా పేర్కొన్నారు.

భవిష్యత్తులో చదువు ఎంతో ముఖ్యం

చదువులో అగ్రస్థానంలో ఉండాలి .రూరల్ ఎస్ ఐ సౌమ్య రెడ్డి

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 20 (నేటినిజం ప్రతినిధి):భవిష్యత్తులో చదువు ఎంతో ముఖ్యమనివేములవాడ రూరల్ ఎస్ఐ సౌమ్య రెడ్డి అన్నారు.శుక్రవారం వేములవాడ మండలం మల్లారం గ్రామంలో సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ను , ప్రిన్సిపాల్ నరసింహ చారి , స్వేరో సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అర్జున్ ప్రారంభించారు .

ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా రురల్ ఎస్ ఐ సౌమ్య రెడ్డి హాజరయ్యారు .ఈ సందర్భంగా ఎస్ ఐ సౌమ్య రెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సమయాన్ని వృధా చేయకుండా పాఠ్యపుస్తకాలను చదవాలని , అన్ని రంగాలలో ముందు ఉండాలని తెలిపారు . చదువుకుంటే భవిష్యత్తు బాగుంటాదని అన్నారు . ఈ కార్యక్రమంలో వేములవాడ గురుకుల పాఠశాల బాలికల ప్రిన్సిపాల్ నరసింహ చారి , మల్లారం గ్రామ సర్పంచ్

పండ్ల తిరుపతి , మల్లారం ఎంపిటిసి మల్లారం తిరుపతి , స్వేరోస్ సర్కిల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లారం అర్జున్ ,అంబేద్కర్ సంఘం గ్రామ అధ్యక్షులు మల్లారం తిరుపతి కొంపల్లి అశోక్ , కొంపల్లి రాజేందర్ కొమ్ము నరేష్ మల్లారం లక్ష్మీరాజ్యం గురుకుల ఉపాధ్యాయులు, టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే నా జీవితాశయం !

సేవా కార్యక్రమాలు చేస్తూ పురిటిగడ్డ రుణం తీర్చుకుంటున్న తోట రామ్ కుమార్

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 20 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలం హన్మజిపేట గ్రామానికి చెందిన గోల్ల కురుమ యాదవ సంఘం సభ్యులు ఈ రోజు స్వచ్ఛందంగా వచ్చి టి ఆర్ కె వ్యవస్థాపక అధ్యక్షులు తోట రామ్ కుమార్ సమక్షంలో సభ్యత్వ నమోదు పత్రాలను అయాన చేతుల మీదుగా అందుకున్నారు , ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన గడ్డ వేములవాడ ప్రజల రుణం తీర్చుకోవడం కోసం సేవా కార్యక్రమాలు చేస్తున్నామని టి ఆర్ కె ట్రస్ట్ ద్వారా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయడమే తమ లక్ష్యం అన్నారు , ట్రస్ట్ ద్వారా చేసే సేవ కార్యక్రమాలు ప్రతి ఒక్కరికీ అందాలనే ఉద్దేశ్యంతో సభ్యత్వ నమోదు పత్రాలను అందిస్తున్నామని తెలిపారు . ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ మొట్టల మహేష్ , ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్ , ట్రస్ట్ ఎంక్వైరీ టీమ్ ఉ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు .

విధులలో అంకితభావం అవసరం - జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

రాజన్న సిరిసిల్లా, నవంబర్ 20 (నేటినిజం ప్రతినిధి): సిబ్బంది విధుల పట్ల అంకిత భావంతో పని చేస్తూనే ఖిర్యాదిదారులతో మర్యాదగా నడుచుకోవాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు .శుక్రవారం వార్షిక తనిఖీలో భాగంగా సిరిసిల్ల పట్టణ డిఎస్పీ కార్యాలయంను జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే తనిఖీ చేశారు. డివిజన్ స్థాయిలో నమోదైన కీలకమైన కేసుల దస్తాల తనిఖీలు చేపట్టారు,డివిజన్ పరిధిలోని నమోదైన ప్రధాన కేసులు, ఎస్స